

- ఎన్నడూలేని విధంగా పోలింగ్ నమోదు
- అధికార పార్టీ అడ్డంకులు బేఖాతరు
- ప్రలోభాలకు లొంగని వైనం
- బెదిరింపులకు తలొగ్గకుండా ఓటు హక్కు వినియోగం
- అధికార పార్టీలో కలవరం

# ఓటెత్తిన ఉద్యోగి..!

## పోస్టల్ బ్యాలెట్‌కు భారీ క్యూలు



పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు ధర్మవరంలో క్యూకట్టిన ఉద్యోగులు

ధర్మవరం, మే 8: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై పెద్దగా చర్చ ఉండేది కాదు. అంత ప్రాధాన్యం కూడా ఉండేది కాదు. ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బంది అవకాశమున్నవారు ఓటేసేవారు. చాలామంది అవకాశం లేకో, అయిష్టతతోనో ఓటింగ్‌కు దూరంగా ఉండేవారు. రిస్క్ తీసుకోవాల్సి వస్తే.. ఓటింగ్‌కు దూరంగా ఉండేవారు. ఎవరు ఓటు వేస్తున్నారో.. ఎప్పుడు వేస్తున్నారో కూడా పెద్దగా చర్చ ఉండేది కాదు. ప్రస్తుత ఎన్నికల్లో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. ఓటు కోసం ఉద్యోగులు పోటెత్తారు. పోస్టల్ బ్యాలెట్ తమకు వ్యతిరేకంగా పడుతుందన్న భావనతో అధికార పార్టీ ఎన్నో అడ్డంకులు సృష్టించింది. వేధింపులకు దిగింది. ప్రలోభాలు, బెదిరింపులు.. ఒక్కటేంటి అన్ని అస్త్రాలనూ ప్రయోగించింది. అవేవీ ఉద్యోగిని అడ్డుకోలేకపోయాయి. పైపెచ్చు ఉద్యోగి కసిగా ఓటేసేలా చేశాయి. వెరసి, ఎన్నడూలేని విధంగా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ నమోదవుతోంది. ఏ ఫెసిలిటేషన్ కేంద్రంలో చూసినా.. భారీ క్యూలు కనిపిస్తున్నాయి. ఎండలోనే గంటల తరబడి ఉద్యోగులు నిలబడుతున్నారు. సాయంత్రమైనా ఓటు కోసం పడిగాపులు కాస్తున్నారు. ఓటు ఇవ్వాల్సిందేనంటూ ఉన్నతాధికారులను నిలదీస్తున్నారు. నిరసనలకు దిగుతున్నారు. ఓటు వేసే తీరుతున్నారు. ఉద్యోగుల తీరు అధికార పార్టీలో కలవరం రేపుతోంది. పోలింగ్ శాతం విపరీతంగా పెరగడం, తమకు వ్యతిరేకంగా ఓట్లు పడతాయన్న అంచనాలతో వైసీపీ అభ్యర్థులు, నేతలకు నిద్ర కరువైంది. ఈ పరిణామం ప్రతిపక్షాల్లో ఆనందం నింపుతోంది. ఓటింగ్ పెరగాలని కోరుకుంటున్నాయి. ఉద్యోగులకు అండగా నిలుస్తున్నాయి.

> ఓటు ఇవ్వకుండా వేధింపులు..
> ఎక్కడుందో చెప్పకుండా సాధింపులు..
> నిలదీస్తే.. ఆఖరుకు కేటాయింపు..
> పోలింగ్ కేంద్రాల్లో వసతులు కరువు..
> మండుటెండలో తాగడానికి నీరూ ఉండదు..
> గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సిన దుస్థితి..
> రాత్రయినా పడిగాపులే..
> వైసీపీ ప్రలోభాలు.. బెదిరింపులు..
> అడుగడుగునా అడ్డంకులే..
> ఇవేవీ ఉద్యోగిని ఆపలేకపోయాయి..
> ఎంతగా అడ్డంకులు సృష్టిస్తే.. అంతకుమించి కసిగా ఓటెత్తారు..
> బ్యాలెట్ ఓటింగ్‌కు పోటెత్తారు..
> కనీవినీ ఎరుగని రీతిలో ఓటేశారు..
> అధికార పార్టీలో కలవరం రేపారు..





కదిరిలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌కు బారులుతీరిన ఉద్యోగులు

### ఓటింగ్ పెరగడానికి కారణాలివే..

సీఎం జగన్ ప్రతిపక్ష హోదాలో 2019 ఎన్నికలకు ముందు సీపీఎస్ రద్దు చేస్తామనీ, అధికారం చేపట్టిన వారంలోపే అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక విస్మరించారు. ప్రభుత్వ ఉద్యోగులపై కక్ష సాధింపులకు దిగారు. జీతాలు సమయానికి ఇవ్వకుండా వేధించారు. 1న ఇవ్వాల్సిన వేతనాలు 15వ తేదీ వరకు ఇవ్వకుండా వారిని ఇబ్బంది పెట్టారు. ఉద్యోగ విరమణ చేసినవారికి వారు దాచుకున్న డబ్బు కూడా ఇవ్వలేదు. పెన్షనర్లకు పెన్షన్ సొమ్ము ఆలస్యంగా ఇవ్వడం, పీఎఫ్, హెల్త్ అలవెన్స్ బకాయిలు ఇవ్వకపోవడం వంటి కారణాలతో అధికార పార్టీపై ఉద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. తమకిచ్చిన హామీలు నెరవేర్చాలని అడిగిన ఉద్యోగ సంఘాలపై వేధింపులు సాగించారు. నిరసనలు, ఆందోళనలకు దిగితే అరెస్టులు చేశారు. ఈ చర్యలతో పాలక పక్షంపై ఉద్యోగ వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. వ్యతిరేక ఓటు వేసేందుకే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం క్యూ కడుతున్నారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

### ఎన్నడూలేని విధంగా దరఖాస్తులు

సార్వత్రిక ఎన్నికల విధులకు ప్రభుత్వ ఉద్యోగులను ఎన్నికల సంఘం నియమించింది. వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించింది. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతోంది. ఈనెల 4, 6, 7, 8 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించారు. గురువారం కూడా కొనసాగనుంది. ఉద్యోగులు ఎన్నడూలేని విధంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వారి ఓట్ల కోసం అధికార పార్టీ అభ్యర్థులు, నాయకులు నానా తంటాలు పడ్డారు. చివరికి తాము అధికార పార్టీ నాయకులమనీ, మళ్లీ అధికారంలోకి వస్తామనీ, ఓటు వేయకపోతే తడాఖా చూపిస్తామంటూ భయభ్రాంతులకు లోనుచేశారు. పెనుకొండ, హిందూపురం, కదిరి, పుట్టపర్తి ప్రాంతాల్లో ఉద్యోగులపై ఎమ్మెల్యే అభ్యర్థులే బెదిరింపులకు దిగడం శోచనీయం. అయినా.. భారీగా పోలింగ్ నమోదవుతుండడం గమనార్హం.



### ఉద్యోగులకు బెదిరింపులు

ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కూటమి అభ్యర్థులకు వేస్తున్నారన్న అక్కసుతో అధికార పార్టీ అభ్యర్థులు, నాయకులు తాయిళాలు, ప్రలోభాలకు తెరలేపారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో తమ పార్టీ వారిని ఏర్పాటు చేసి, డబ్బులు ఇవ్వజూపారు. ఓటుకు రూ.5 వేల వరకు ఇచ్చేందుకు సిద్ధమన్నారు. అయినా ఉద్యోగులు లొంగలేదు. రెండోదశలో బెదిరింపు అస్త్రం ప్రయోగించారు. ఎమ్మెల్యే అభ్యర్థులు, వారి కుటుంబికులు ఏకంగా పోలింగ్ కేంద్రాల్లోకే వెళ్లి ఉద్యోగులను బెదిరించడం వెలుగులోకి వచ్చింది. వైసీపీనే మళ్లీ అధికారంలోకి వస్తుందనీ, వ్యతిరేకంగా ఓటు వేస్తే తడాఖా చూపిస్తామంటూ భయభ్రాంతులకు లోనుచేయడం శోచనీయం. పెనుకొండ, కదిరి, హిందూపురం, పుట్టపర్తి ఘటనలే ఇందుకు నిదర్శనం. వాటినీ ఉద్యోగులు ఖాతరు చేయలేదు. ఓటింగ్‌కు పోటెత్తారు. ఉద్యోగులు దేనికీ లొంగకపోవడం, ఓటింగ్‌కు క్యూ కట్టడంతో అధికార పార్టీ నేతలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. వాటిలో అత్యధిక భాగం పాలక పక్షానికి వ్యతిరేకంగా పడతాయని రాజకీయ విశ్లేషకులు బల్లగుద్ది చెబుతున్నారు. అధికర పార్టీ నాయకులు ఆందోళనలో పడ్డారు. ఈనెల 13న పోలింగ్‌లో ఇదే పరిస్థితి తలెత్తితే అధికార పార్టీకి ఘోర పరాభవం తప్పదన్న వాదనలు వినిపిస్తున్నాయి.



---

సాగు, తాగునీటికి ప్రాధాన్యమిస్తా

పుట్టపర్తి పర్యాటకాభివృద్ధికి కృషి చేస్తా

'ఆంధ్రజ్యోతి'తో పల్లె సింధూరారెడ్డి

## పరిశ్రమలు తెస్తా..

# యువతకు ఉపాధి కల్పిస్తా...



మాట్లాడుతున్న పల్లె సింధూరా రెడ్డి

పుట్టపర్తి, మే 8: సత్యసాయి బాబా ద్వారా ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రసిద్ధికెక్కిన పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గం నుంచి ఆమె తొలిసారిగా బరిలో దిగుతున్నారు. ఇక్కడి నుంచి పోటీచేస్తున్న తొలి మహిళ కూడా ఆమే కావడం విశేషం. రాజకీయాలకు కొత్తయినా.. మామ పల్లె రఘునాథరెడ్డి రెండుమార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, చీఫ్ విప్‌గా పనిచేసిన అనుభవం ఆమెకు ఎంతగానో తోడ్పడనుంది. నియోజకవర్గంలోని మారుమూల పల్లెలకు సైతం పల్లె రఘునాథరెడ్డి సుపరిచితుడు కావడం, ఆపదలో ఉన్నవారికి ఆయన అందించిన సాయం, సేవాకార్యక్రమాలు సింధూరారెడ్డికి కలసి వచ్చే అంశాలు. ప్రస్తుతం అధికార వైసీపీపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారనీ, మార్పు కోరుకుంటున్నారనీ తన విజయం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అయ్యాక పుట్టపర్తికి పరిశ్రమలు తీసుకొచ్చి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని ఆమె బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆ వివరాలిలా ఉన్నాయి.

**ఆంధ్రజ్యోతి: మీకు ఆదర్శం ఎవరు?**

**పల్లె సింధూర:** మానాన్న కేరళ డీజీపీగా పనిచేశారు. నేను కూడా సివిల్స్‌కు వెళ్లాలన్న నాన్న ఆశయం నెరవేరలేదు. నాకు కిరణ్‌బేడీ ఆదర్శం. డాక్టర్ కావాలని కలలు కన్నా. నానోటెక్నాలజీ ఇంజనీరయ్యా. అనుకోకుండా రాజకీయాల్లోకి రావాల్సి వచ్చింది.

**ఆంధ్రజ్యోతి: ప్రచారంలో ఎక్కువగా ఏ సమస్యలు మీ దృష్టికి వచ్చాయి?**

**పల్లె సింధూర:** నిరుద్యోగులకు స్థానికంగా ఉపాధి లేక పక్క రాష్ట్రాలకు వలస వెళ్లారు. గ్రామాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉంది. ఒకప్పుడు నియోజకవర్గంలో వేరుశనగ అధికంగా పండేది. వర్షాలు కురవక, పంటలు పండక రైతులు పక్క రాష్ట్రానికి వలస కూలీలుగా వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది.

**ఆంధ్రజ్యోతి: సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు?**

**పల్లె సింధూర:** ప్రజలకు అత్యవసరమైనది స్వచ్ఛమైన తాగునీరు. పంటలు పండించడానికి సాగునీరు అవసరం. మామ పల్లె రఘునాథరెడ్డి తన పదవీకాలంలో 193 చెరువులు నింపేందుకు ప్రణాళిక రూపొందించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. హంద్రీనీవా కాలువ ద్వారా 193 చెరువులకు నీరు నింపి, పొలాలను సస్యశ్యామలం చేస్తా. ఇంటింటికీ కొళాయి ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందిస్తా.

**ఆంధ్రజ్యోతి: ప్రస్తుత ఎమ్మెల్యే ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకపోవడంపై మీ స్పందనేంటి?**

**పల్లె సింధూర:** ప్రజలకు తాగునీరు ఇవ్వాల్సిందిపోయి.. సత్యసాయిబాబా పథకం కింద ఇస్తున్న నీటిని తన పొలానికి అక్రమంగా వాడుకున్న ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి. అలాంటి ఆయన ప్రజలకు ఏం న్యాయం చేస్తారు? అవినీతి ఆరోపణలు, ప్రతి పనికీ ఓ రేటు, భూకబ్జాలతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. కుటుంబ పాలనతో ప్రజలు విసిగిపోయారు. టీడీపీ హయాంలో నిర్మించిన వాటర్ ట్యాంకులకు వైసీపీ రంగులేసుకుని, ప్రచారం చేసుకుంటున్నారు.

**ఆంధ్రజ్యోతి: మీరు ఎమ్మెల్యే అయితే మీ ప్రాధాన్యత ఏంటి?**

**పల్లె సింధూర:** చిన్నతరహా పరిశ్రమలు తీసుకొచ్చి, యువతకు ఉపాధి కల్పిస్తా. జిల్లా కార్యాలయాల భవన నిర్మాణాలకు కృషి చేస్తా. చిత్రావతి సుందరీకరణ, మునిసిపాలిటీ భవన నిర్మాణం చేపడతా. పుట్టపర్తికి ఆధ్యాత్మిక శోభ తెస్తా. పర్యాటకంగా అభివృద్ధి చేస్తా. అమగొండపాలెం అటవీ ప్రాంతంలో ఆగిపోయిన వననగరం నిర్మాణం పూర్తి చేస్తా.

> **ఆంధ్రజ్యోతి: ప్రచారంలో ప్రజాస్పందన ఎలా ఉంది?**
>
> **పల్లె సింధూర:** నాకు టిక్కెట్ వస్తుందని ఊహించలేదు. ప్రచారంలో మొదట భయమేసింది. ఆ తర్వాత మహిళలు తమకే టిక్కెట్ వచ్చినట్లు ఆదరించి, వెన్నంటే నడుస్తూ ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మేధావులు, నిరుద్యోగ యువత టీడీపీవైపు చూస్తున్నారు. కూటమి ఇచ్చిన హామీలు, సూపర్‌సిక్స్ నా విజయానికి బాటలు. టీడీపీ విజయం ఖాయం, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యం.

---


## మద్యం దుకాణాలు బంద్

పుట్టపర్తి, మే8(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 48 గంటలపాటు మద్యం, కల్లు దుకాణాలు బంద్ చేయనున్నట్లు జిల్లా ఎక్సైజ్ శాఖాధికారి సహదేవ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న సాయంత్రం 7 నుంచి 13 సాయంత్రం 7 గంటలదాకా జిల్లాలోని అన్ని ప్రభుత్వ మద్యం దుకాణాలతోపాటు బార్లు, కల్లు దుకాణాలు మూసివేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

---

- నదులన్నీ లూటీ..
- రాత్రింబవళ్లు తవ్వకాలు..
- పక్క రాష్ట్రానికి టిప్పర్ల క్యూ..
- కోట్లు కొల్లగొట్టిన వైసీపీ నేతలు
- జిల్లా వాసులకు ఇసుక కరువు

> జగన్ ప్రభుత్వం రాగానే ఉచిత ఇసుక విధానాన్ని రద్దుచేసి, ప్రభుత్వ రంగ సంస్థలకు అప్పగించింది. అది విఫలమైందన్న సాకు చూపించి బినామీ కాంట్రాక్టర్లను రంగంలోకి దింపింది. ఇలా ఐదేళ్లలో వందల కోట్ల రూపాయల ఇసుక తోడేసింది. ఇసుక అమ్మకాల్లో ఆన్‌లైన్ డిజిటల్ చెల్లింపులకు అవకాశం ఇవ్వలేదు. కేవలం నగదు తీసుకుని, ఇసుక విక్రయించారు. మొత్తంగా ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం ఇసుక రూపంలో జిల్లాలో వందల కోట్ల మేర దోపిడీ చేసింది.
>
> \- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి



పుట్టపర్తి సమీపాన చిత్రావతి నదిలో నీటిలోనే ఇసుక తవ్వకాలు (ఫైల్)



# ఇసుకాసురులు..!

## జిల్లాలో యథేచ్ఛగా ఇసుక దోపిడీ

> వైసీపీ ప్రభుత్వం ఇసుక వ్యాపారానికి తెరలేపింది..
> ఆ పార్టీ నాయకులు ఇసుకాసురులుగా మారిపోయారు..
> వంకలు, ఏరులను వదల్లేదు..
> నదులను లూటీ చేశారు..
> రీచ్‌లు పెట్టి ప్రభుత్వం తోడేస్తే..
> అనధికారిక రీచ్‌లతో వైసీపీ నాయకులు లూటీ చేశారు..
> ఇసుకను పక్క రాష్ట్రానికి తరలించి.. రూ.కోట్లు కొల్లగొట్టారు..
> జిల్లావాసులకు ఇసుకను దూరం చేశారు..
> ఇక్కడ కరువు సృష్టించారు..
> పక్క రాష్ట్రానికి అడిగినంత తోలారు..

### ఇసుకలో దోచేసిన జగన్ సర్కార్

రాష్ట్రవ్యాప్తంగా నదుల్లో లభించే ఇసుకను వైసీపీ ప్రభుత్వం ఆదాయమార్గంగా మలచుకుంది. 2019 సెప్టెంబరు 5న కొత్త విధానాన్ని అమలులోకి తెచ్చింది. టన్నుల లెక్కన ధర కట్టి, విక్రయిస్తూ ప్రైవేటు సంస్థలకు ఇసుక వ్యాపారం అప్పగించింది. 2021 జనవరిలో టెండర్లు పిలిస్తే రాష్ట్రంలో జేపీ వెంచర్ సంస్థకు దక్కించుకునేలా వ్యూహం రచించారు. టన్ను ఇసుక ధరను రూ.475కి పెంచేశారు. ఆ తరువాత కనీవినీఎరుగని రీతిలో సహజ వనరులను దోచేసింది. జేపీ వెంచర్ నుంచి ఉమ్మడి జిల్లాలో అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి ఇసుక వ్యాపారాన్ని సబ్ లీజుకు తీసుకున్నాడు. అనుమతి పొందిన దానికన్నా వందల రెట్ల తవ్వకాలు చేపట్టారు. ఆయా నియోజక వర్గాల్లో అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు వాటాలు ఇచ్చి, తవ్వకాలు సాగించి సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. రీచ్‌లో ఎంత తవ్వకాలు చేపట్టారో అడిగేనాథుడే లేడు. దీంతో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టారు. జేపీ వెంచర్ స్థానంలో ప్రతిమ సంస్థ వచ్చింది. సంస్థ ఏదైనా ఇసుక దోచుడు మాత్రం సేమ్. ఇసుక త్వకాల్లో అడ్డగోలుగా నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణలున్నాయి. నదులను గుల్ల చేసి, ఇసుక లూటీ చేశారు.

### అడ్డగోలుగా తోడేశారు..

జిల్లాలోని నదులను జేపీ కంపెనీ పేరుతో అధికార పార్టీ నేతలు పంచుకుని, రూ.కోట్లు సొమ్ము చేసుకున్నారు. నదులు, వాగుల్లో సైతం ఇసుక తవ్వకాలు చేపట్టారు. రైతులు, ప్రతిపక్ష, ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తే పోలీసుల ద్వారా ఉక్కుపాదం మోపారు. యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపట్టి, రవాణా చెయొద్దని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలిచ్చినా బేఖాతరు చేశారు. అడిగేదెవరన్నట్లుగా పెన్నా, చిత్రావతి నదుల్లో తవ్వకాలు చేపట్టి, ఇసుక లూటీ చేశారు. అధికార పార్టీ నేతలు ఇసుక కాంట్రాక్టర్ల అవతారమెత్తి దోచేస్తున్నా జిల్లా యంత్రాంగం చోద్యం చూడడం విమర్శలకు తావిస్తోంది. జిల్లాలో పలు రీచ్‌లలో తవ్వకాల గడువు ముగిసినా ఇప్పటికీ ఆ సంస్థ కనుసన్నల్లోనే వ్యాపారం సాగుతోంది. చిత్రావతిలో ఉప్పలపాడు, పెన్నా, జయమంగళి నదుల్లో ఇసుక రీచ్‌ల పేరుతో రాత్రింబవళ్లు తవ్వకాలు చేపట్టి, టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలిస్తున్నా అడిగేనాథుడే లేడు. వైసీపీ నాయకులు చెప్పిందే వేదంగా భావిస్తూ అధికారులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు మూటగట్టుకున్నారు. జిల్లాలో భూగర్భ గనుల శాఖతోపాటు ఇసుక మద్యం అక్రమాలను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ఉన్నా అడ్డుకట్ట వేయలేకపోయారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్న వాహనాల వైపు కన్నెత్తి చూసే సాహసం కూడా చేయలేదు.

### లూటీ సాగుతోందిలా..

పెన్నా, చిత్రావతి నదుల్లో జేపీ పవర్ వెంచర్ కంపెనీ కాంట్రాక్టు అనుమతులను అడ్డం పెట్టుకుని అధికార పార్టీ నేతలు, ఎమ్మెల్యేల, అనుచరులు ఇసుక దందాలకు తెరలేపారు. పెన్నానదిలో కొడిగెనహళ్లి, తుమ్మలకుంట, పరిగి, చిత్రావతిలో దంపెట్ల ఓపెన్‌రీచ్‌లను గుర్తించారు. ఇందులో పరిగి, దంపెట్ల రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు అనుమతులు లేకున్నా తవ్వేశారు. చిత్రావతి నదిలో ముదిగుబ్బ మండలం ఉప్పలపాడు, పీసీరేవు, తాడిమర్రి మండలం సీసీ రేవుల్లో రీచ్‌లను గుర్తించారు. ఇందులో ఉప్పలపాడు, పీసీ రేవు ఇసుక రీచ్ నుంచి రాత్రింబవళ్లు వందల టిప్పర్లతో ఇసుక రవాణా చేస్తున్నారు. ముదిగుబ్బ, బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లో ఇందుకూరు, డీచెర్లోపల్లి, పెద్దకోట్లకు చెందిన అధికారపార్టీ ప్రజాప్రతినిధి అనుచరులను పెట్టి, చిత్రావతిలో ఇసుక తవ్వకాలతో రోజూ రూ.50లక్షలకుపైగా దోచేస్తున్నాడు. ఇసుక రీచ్‌ల వద్ద అధికార పార్టీ నేతలు కొందరు రౌడీలను పెట్టుకుని, అటువైపు ఎవరూ రాకుండా బెదిరిస్తున్నారు. ఉప్పలపాడు, గరిసనపల్లి మధ్య రీచ్ వైపు వెళ్లాలంటే ఎవరూ సాహసించట్లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. రోజూ వందల టిప్పర్లు, ట్రాక్టర్లతో లక్షల టన్నుల ఇసుక తరలిస్తున్నారు. ఇక్కడ భారీగా తవ్వకాలు చేపడుతున్నా అధికార యంత్రాంగం చోద్యం చూస్తోంది. ఇసుక తవ్వకాల ద్వారా ఐదేళ్లలో రూ.400 కోట్లకుపైగా దోచేశారు. పరిగి వద్ద పెన్నానది, జయమంగళి నదుల్లో ఇసుక రీచ్‌కు అనుమతులు లేకున్నా.. రోజూ వందల టిప్పర్లు, ట్రాక్టర్లతో ఇసుక లూటీ చేశారు. ఇక్కడ ఎమ్మెల్యే సోదరుల కనుసన్నల్లో ఇసుక తవ్వకాలు చేపట్టి, సరిహద్దు దాటిస్తున్నారు. పెన్నా నదిలో చౌళూరు నుంచి రొద్దం మండలం నారనాగేపల్లి దాకా విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. తద్వారా రూ.50 కోట్లకుపైగా దోసేశారు. పుట్టపర్తిలో అధికార పార్టీ నేతల కనుసన్నల్లో చిత్రావతి, సోమావతి నదుల్లో అడ్డూఅదుపులేకుండా తవ్వకాలు చేపడుతున్నారు. రూ.40 కోట్ల దాకా సొమ్ము చేసుకుంటున్నారు. హిందూపురం వద్ద పెన్నా నదిలో బేవనహళ్లి, సతేబిందనూరు వద్ద రీచ్‌లు పెట్టి, వందల లారీల ఇసుక నిరంతరాయంగా తరలిస్తున్నారు. అక్కడి నుంచి సరిహద్దు దాటిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడ హిందూపురం వైసీపీ నేతలు గ్రామాల వారీగా నదిని పంచుకుని, వందల కోట్లు సొమ్ము చేసుకుంటున్నారు.

### జిల్లావాసులపై భారం

జిల్లాలో పెన్నా, చిత్రావతి, జయమంగళి, కుషావతి, సువర్ణముఖి, సోమావతి, సీజీ, పెడబల్లి ప్రాజెక్టులతోపాటు ఉపనదులున్నాయి. చిత్రావతి, పెన్నా నదుల్లో ఇసుక తవ్వకాలకు అడ్డూఅదుపులేకుండా పోతోంది. వైసీపీ నేతలు స్థానికంగా కొందరు బినామీలను ఏర్పాటు చేసుకున్నారు. ఇసుక కావాలంటే వారిని సంప్రదించాల్సి వస్తోంది. ప్రభుత్వ రీచ్‌ల నుంచి ఇసుకను తీసుకొస్తున్నామని చెప్పి, నదుల్లో అక్రమ తవ్వకాలు చేపట్టి రెట్టింపు ధరతో విక్రయిస్తున్నారు. నదుల్లోకి ఇసుక కోసం సామాన్యులు అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం నిర్ధేశించిన ధరకే నాణ్యమైన ఇసుక అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నా అది అందుబాటులోకి రాలేదు. పుట్టపర్తి పక్కనే చిత్రావతి నది ఉన్నా ట్రాక్టర్ ఇసుక రూ.4 వేల నుంచి రూ.5 వేలు చెల్లించాల్సి వస్తోంది. దూర ప్రాంతాలకైతే మరింత ఎక్కువగా ఇచ్చుకోవాల్సిందే. టిప్పర్ ఇసుక రూ.20 వేల నుంచి రూ.22వేలు చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇలా జిల్లావ్యాప్తంగా ప్రజలపై ఇసుక భారం మోపుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనా బహిరంగంగానే ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. అడ్డుకట్టు వేయాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.



ఇసుక రీచ్‌లో తవ్వకాలు

## పోలింగ్ రోజు మాక్ పోల్



**అనంతపురం అర్బన్:** పోలింగ్ రోజున అసలైన పోలింగ్ ప్రారంభం కావడానికి 90 నిమిషాల ముందు మాక్ పోల్ నిర్వహిస్తారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో 50 ఓట్లను వేయడం ద్వారా నోటాతో సహా పోటీలోని ప్రతి అభ్యర్థికి నమోదైన ఓట్లను నిర్ధారిస్తారు. కంట్రోల్ యూనిట్ ఎలక్ట్రానిక్ ఫలితాలు, వీవీ ప్యాట్ స్లిప్‌ల కౌంట్‌ను ఏజెంట్ల సమక్షంలోనే లెక్కించి చూపిస్తారు. మాక్ పోలింగ్ విజయవంతంగా నిర్వహించినట్లు సర్టిఫికెట్‌ను ప్రిసైడింగ్ ఆఫీసర్ రిపోర్టులో పొందుపరుస్తారు. మాక్ పోల్ ప్రక్రియ ముగిసిన వెంటనే ఆ డేటాను క్లియర్ చేసేందుకు కంట్రోల్ యూనిట్(సీయు)లోని క్లియర్ బటన్‌ను నొక్కుతారు. మాక్ పోల్ ఓట్లను తొలగించిన తర్వాత సీయూలో ఓట్లు నమోదు కాలేదన్న విషయాన్ని అక్కడి పోలింగ్ ఏజెంట్లకు ప్రదర్శించి చూపుతారు. ప్రిసైడింగ్ అధికారి అన్ని మాక్ పోల్ స్లిప్‌లను వీవీ ప్యాట్ స్లిప్ కంపార్టుమెంట్ నుంచి బయటకు తీసి వాటిని మాక్ పోల్ స్లిప్ అని స్టాంప్ వేస్తారు. అసలైన పోలింగ్ ప్రారంభానికి ముందు ప్రత్యేకంగా సీలు వేసిన నలుపు కవర్‌లో మాక్ పోల్ స్లిప్‌లను ఉంచి పోలింగ్ ఏజెంట్లకు చూపుతారు. మాక్ పోల్ తర్వాత పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లకు సీలు వేస్తారు. అసలు పోల్ ప్రారంభించే ముందు సీళ్లపై పోలింగ్ ఏజెంట్ల సంతకం తీసుకుంటారు.

## మా ఓటు మాటేమిటి సార్..?

### ఎన్నికల విధుల్లో వీడియోగ్రాఫర్లు



**ముదిగుబ్బ:** ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ నేతలపై ఎన్నికల సంఘం నిఘా వేసింది. అధికారులు వీడియోగ్రాఫర్లతో ఎన్నికల ప్రచార శైలిపై వీడియోలు తీయిస్తున్నారు. ఎన్నికల అధికారుల వెంట ఉండే వీడియోగ్రాఫర్లు ఓటు హక్కు వియోగించుకొనే అవకాశం ఉందా...? నియోజకవర్గానికి పలువురు వీడియోగ్రాఫర్లను ఎన్నికల అధికారులు పనిలో ఉంచుకున్నారు. వారంతా ఓటు హక్కు వదులుకునే పరిస్థితి కనిపిస్తోంది. ఎన్నికల కమిషన్ ఈసారి జర్నలిస్టులకు పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు అవకాశం కల్పించింది. తమకు కూడా ఆ కోటాలో పోస్టల్ బ్యాలెట్ వేసుకోవచ్చు కదా అని ఆశించారు. ఐడీ కార్డులు జారీ చేయకపోవడంతో ఈసారి కూడా తమ ఓటు హక్కును వినియోగించుకోలేకపోతున్నామని వీడియోగ్రాఫర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం, ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని, ఊదరగొట్టే అధికారులు తమ వెంట ఉండే సిబ్బంది, పనిలో ఉన్నవారందరితో ఓటు వేయిస్తారో... లేదో ?

## లాగేసి.. దోచేస్తున్నారు..!



**ఈ** చిత్రంలో కనిపిస్తున్న వాటర్ ప్లాంట్ అనంతపురం రూరల్ మండలం ఆలమూరు గ్రామంలోనిది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. బిందె రూ.2లతో సురక్షిత మంచినీటి సరఫరా చేస్తూ గ్రామస్థుల తాగునీటి సమస్యకు పరిష్కారం చూపారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చాక స్థానిక వైసీపీ నాయకులు ప్లాంట్ లాగేసుకున్నారు. రంగులు, బొమ్మలు మార్చేశారు. బిందె రూ.5తో విక్రయిస్తూ గ్రామస్థుల సొమ్మును దోచేస్తున్నారు. ఈ విధంగా నియోజకవర్గంలో ఇలాంటి వాటర్ ప్లాంట్లు చాలానే ఉన్నాయి. వీటి కోసం మొదట్లో వైసీపీ నాయకులు నానా రాద్ధాంతం చేసి లాగేసుకున్నారంటే అతిశయోక్తి కాదు.


- అనంతపురంరూరల్



# వైసీపీ పాలనలో... ఉద్యోగాలు నిల్..!

జాబ్ క్యాలెండర్‌పై సీఎం మోసం

ఏటా పెరుగుతున్న నిరుద్యోగులు



- నిరుద్యోగులుగా డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు
- జగన్ హామీ ఇచ్చి.. మాట తప్పారంటూ మండిపడుతున్న నిరుద్యోగులు

**అనంతపురం సెంట్రల్:** ప్రతి ఏటా జనవరికి జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాలు భర్తీ చేస్తామని గత ఎన్నికల్లో హామీనిచ్చి గద్దెనెక్కిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో ఒక్క జాబ్ క్యాలెండర్‌నూ విడుదల చేయలేదు. ముఖ్యమంత్రి పదవి కోసం ఆయన.. తమను మోసం చేశాడని నిరుద్యోగ వర్గాలు మండిపడుతున్నాయి. అమ్మా.. అక్కా.. మీపిల్లలకు ఉద్యోగమిస్తా ఒక్కసారి అవకాశం ఇవ్వండి అంటే నమ్మి ఓట్లేశామని, అందుకు తమకు తగిన శాస్తి చేశారని నిరుద్యోగుల తల్లిదండ్రులు వాపోతున్నారు. లక్షలాది రూపాయలు పోసి డిగ్రీలు, పీజీలు, పీహెచ్‌డీలు చదివించిన పిల్లలు ఉద్యోగాల్లేక ఇంటివద్ద ఖాళీగా ఉంటే ఆ బాధ వర్ణనాతీతంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమలు లేక, ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లు రాక తమ పిల్లలు మానసికంగా కృంగిపోతున్నారని వాపోతున్నారు. ఎస్కేయూ, జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో విద్యను పూర్తిచేసి ప్రతియేటా వేలాదిమంది విద్యార్థులు పట్టాలు పుచ్చుకుని సమాజంలోకి అడుగుపెడుతున్నారు. అయితే వారిలో పట్టుమని పదిశాతం మందికికూడా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడం లేదు. 2020-23వరకు నాలుగేళ్లలో దాదాపు 2,38,636మంది విద్యార్థులు ఉద్యోగ, ఉపాధిలేక నిరుద్యోగులుగా మిగిలిపోయారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వం మాత్రం ప్రతి విద్యార్థి ఉన్నతశిఖరాలను అధిరోహించాలని చిలకపలుకులు పలుకుతోందని నిరుద్యోగులు మండిపడుతున్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయకపోతే నిరుద్యోగాన్ని రూపుమాపడం ఎలా సాధ్యమౌతుందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. యువత మేలుకుని ఉద్యోగాలిచ్చే ప్రభుత్వాన్ని ఓటుతో ఎన్నుకోకపోతే భవిష్యత్తు అంధకారమౌతుందని హెచ్చరిస్తున్నారు.

### నిరుద్యోగులు పెరిగిపోయారు

ఐదేళ్ల వైసీపీ పాలనలో నిరుద్యోగ శాతం పెరిగిపోయింది. ప్రభుత్వ శాఖల్లో ఒక్క ఖాళీపోస్టుకూడా భర్తీచేయలేదు. ఆదేవిధంగా పరిశ్రమలు తీసుకువచ్చి ఉపాధి కల్పించే ఆలోచన జగన్‌కు లేదు. రానున్న కూటమి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి 36వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తుంది. ఆదేవిధంగా జిల్లాకొక పరిశ్రమను స్థాపించి ఆయా ప్రాంతాల్లోని విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తుంది.

**-లక్ష్మీనారాయణ, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి**

### పెరుగుతున్న నిరుద్యోగం

వైసీపీ ప్రభుత్వ ఏర్పాటు అనంతరం నిరుద్యోగ శాతం ప్రతి ఏడాదీ పెరుగుతూ పోతోందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. 2020వ సంవత్సరంలో 46,990 మంది, 2021లో 53,149 మంది, 2022లో 64,868 మంది, 2023లో 73629 మంది ఇలా ప్రతి సంవత్సరం నిరుద్యోగుల సంఖ్య పెరుగుతోందని, ఈ పరిణామం భవిష్యత్తుకు ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేకుంటే మానసిక రుగ్మతులకు లోనై ఇతర మార్గాలవైపు వెళ్లేందుకు అలవాటుపడుతారని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా దేశంలోనే అత్యధిక యువత కల్గిన రాయలసీమ నిరుద్యోగ సీమగా మారుతుందని పేర్కొంటున్నారు.

### మారుస్తానని మాడ్చేశాడు..

అమ్మా.. అక్కా.. మీ బిడ్డలను నేనే చదివిస్తా.. ఉద్యోగాలు సైతం ఇప్పించి ప్రయోజకులుగా మారుస్తానని జగన్ అమాయక మొహం వేసుకుని చెప్పారని, సరే ఒకసారి చూద్దామని నమ్మి ఓట్లు వేసినందుకు మాకు జీవితాలే లేకుండా చేశారని నిరుద్యోగ విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. వేలకు వేలు చెల్లించి చదివించినందుకు చదవుల పట్టాలు మాత్రమే వచ్చాయని, ఉద్యోగాలు రాలేదని వాపోతున్నారు. మరోసారి వైసీపీ ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే ఇంటిల్లిపాది రోడ్డున పడాల్సిందేనని పేర్కొంటున్నారు. జగన్‌ను గద్దె దించకపోతే యవతకు భవిష్యత్తు ఉండదని హెచ్చరిస్తున్నారు.

### పరిశ్రమలే ఏకైక మార్గం..

నిరుద్యోగాన్ని రూపుమాపే ఏకైక మార్గం పరిశ్రమలేనని, వాటిని తీసుకొచ్చే ఆలోచన, సత్తా జగన్‌కు లేదని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పూర్తిచేసిన విద్యార్థుల కోసం ఈ ఐదేళ్లలో ఏఒక్క పరిశ్రమనైనా రాష్ట్రానికి తీసుకొచ్చిన పాపాన పోలేదని మండిపడుతున్నారు. జిల్లాకు ఒకకొత్త పరిశ్రమను స్థాపించివుంటే నిరుద్యోగశాతం గణనీయంగా తగ్గేదని చెబుతున్నారు.

**పట్టాలు అందుకుని ఉద్యోగాల్లేని విద్యార్థుల వివరాలు..**

| కోర్సు | 2019-20 | 2020-21 | 2021-22 | 2022-23 | మొత్తం |
|---|---|---|---|---|---|
| డిగ్రీ | 13,738 | 15,187 | 18,975 | 21,686 | 69,586 |
| బీటెక్ | 24,653 | 27,911 | 33,942 | 38,577 | 12,5083 |
| బీఫార్మసీ | 2,431 | 2,753 | 32,49 | 3,584 | 12,017 |
| పీజీ | 3,962 | 4,637 | 5,753 | 6,368 | 20,720 |
| పీహెచ్‌డీ | 332 | 321 | 243 | 226 | 1,122 |
| పాలిటెక్నిక్ | 1,980 | 2,418 | 2,628 | 3,082 | 10,107 |
| మొత్తం | 46,990 | 53,149 | 64,868 | 73,629 | 23,8636 |

### ఒక్క జాబ్ క్యాలెండర్ కూడా విడుదల చేయలేదు

ప్రతి జనవరికి జాబ్‌క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాలిస్తామని చెప్పి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం పదవిని పొందారు. అయితే ఐదేళ్లలో ఒక్క జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా నిరుద్యోగులను నడిరోడ్డున పడేశారు. ప్రభుత్వ కొలువులు భర్తీచేయాలని, ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదలచేయాలని ఐదేళ్లుగా నిరసనలు, ర్యాలీలు చేస్తున్నా సీఎంకు చెవికెక్కలేదు. అందుకే ఈ ఎన్నికల్లో నిరుద్యోగులే ఆయన్ను సీఎం పదవిని నుంచి డిస్‌మిస్ చేయబోతున్నారు.

**-టీపీ రామన్న, విద్యార్థి నిరుద్యోగ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు**

### మెగా డీఎస్సీ విడుదల చేయాలి..



ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయ ఖాళీలన్నీ భర్తీ చేసేలా మెగా డీఎస్సీని విడుదల చేస్తే నాలాంటి వారందరికీ ఉద్యోగాలు లభిస్తాయి. పీజీ, బీఈడీ, టీటీసీ పూర్తిచేసినా ఉద్యోగాల్లేవు. ప్రభుత్వ శాఖల్లో లక్షలాది కొలువులు ఖాళీఉన్నా ప్రభుత్వం వాటిని భర్తీచేయడం లేదు. ప్రతి ఏటా జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తామని హామీనిచ్చి చేతులెత్తేశారు. ప్రైవేట్ రంగాల్లోనూ ఉద్యోగాల్లేవు. వచ్చే ప్రభుత్వమైనా సకాలంలో ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలి.

**-రంగస్వామి, పీజీ, బీఈడీ, టీటీసీ**

### ఉపాధి పనులకెళ్లి చదివిస్తున్నారు



మా తలిదండ్రులు ఉపాధి పనులకెళ్లి నన్ను చదివిస్తున్నారు. నాలాగా పీజీ పూర్తిచేసి వేలాది మంది విద్యార్థులు ఏళ్లతరబడి పోటీ పరీక్షలకు సిద్ధమౌతున్నారు. ప్రభుత్వ కొలువు వస్తుందని వందలాదిమంది విద్యార్థులు సొంతూరును వదిలేసి నగరంలోనే అద్దెగదుల్లో ఉంటూ చదువుకుంటున్నారు. అందులో చాలామంది మధ్యాహ్నం గుడిలో ప్రసాదం భుజిస్తూ కష్టపడి చదువుతున్నారు. అందుకు తగిన ప్రతిఫలంగా ఉద్యోగాలకోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్‌లు విడుదల చేసి త్వరగా ఖాళీలను భర్తీచేయాలి.

**-కొల్లప్ప, పీజీ**

### ఫలితంలేకుండా పోతోంది..



ఉద్యోగం సాధించాలన్న తపనతో రేయింబవలు కష్టపడి చదువుతున్నా ఫలితం లేకుండా పోతోంది. వేలాది ఉద్యోగాలంటూ ప్రకటనలు చేసి పెండింగ్‌లో పెడుతున్నారు. ఏఒక్క ప్రభుత్వ శాఖలోకూడా పూర్తిస్థాయి ఉద్యోగులు లేరు. ఆయా ఖాళీలన్నీ భర్తీచేస్తే ప్రజలకు మెరుగైన సేవలందడమే కాకుండా ఉద్యోగాలు పొందినవారి కుటుంబాలన్నీ బాగుపడుతాయి.

**-రాజకుళ్లాయప్ప, డిగ్రీ**

# వైసీపీలో నైరాశ్యం



- ద్వితీయ శ్రేణి నాయకులను పట్టించుకోలేదని ఆవేదన
- పోలింగ్ దగ్గరపడుతున్నా మందకొడిగానే ప్రచారం
- నగదు పంపిణీకి పక్క జిల్లా నాయకులు

హిందూపురం

ఎన్నికల పోలింగ్ దగ్గరపడుతున్నా అధికార పార్టీ ప్రచారం ఇప్పటికీ మందకొడిగానే సాగుతోంది. ఒకవైపు హిందూపురం నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి నందమూరి బాలకృష్ణ సతీమణి చిలమత్తూరు, లేపాక్షి, హిందూపురం పట్టణంలో ఓటర్లను కలిశారు. మరోవైపు బాలకృష్ణ ఇతర జిల్లాల్లో ప్రచారం చేస్తున్నా నామినేషన్ అనంతరం లేపాక్షి మండలంలో ప్రచారం నిర్వహించారు. పట్టణ, రూరల్ మండలంలో కూడా ఒక విడత ప్రచారం ముగించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఇప్పటికీ ఒక మండలం కానీ, పట్టణంలో కానీ ప్రచారం పూర్తీ చేసిన దాఖలాలు లేవు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పోలింగ్ దగ్గర పడుతున్నా పరిస్థితి ఇలా ఉంటే ఎలా అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ఎప్పుడూ ఎన్నికల సమయంలో బీజీగా ఉండే నాయకులు ఇంటికే పరిమితమయ్యారంటే పరిస్థితి అర్థమవుతోంది.

### మాట్లాడేవారేరీ..?

ద్వితీయ నాయకులు, కార్యకర్తల్లో మరింత నిరుత్సాహం నెలకొంది. పోలింగ్‌కి తక్కువ గడువు ఉండటంతో ఇప్పటికీ వారిని ముఖ్యనేతలు మాట్లాడకపోవడంతో మదనపడుతున్నారు. తమను ఇప్పటికీ ముఖ్యనేతలు వచ్చి ప్రచారం చేయమని కానీ, ఓటు అడుగమని కానీ చెప్పలేదని, ఇలా అయితే తాము ముందుకు ఎలా వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఓటు అడగడానికి వెళితే కొన్ని హామీలు, మరి కొన్ని తాయిళాలు, ఆశలు తీర్చడం సహజం. ముఖ్యనేతలు ద్వితీయ శ్రేణి నాయకులకు ఎలాంటి సూచనలు ఇవ్వకపోవడంతో మాకెందుకులే అన్నట్లు కింద స్థాయి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

### కండువాలు మారుస్తున్నా చలనం లేదు..

రెండు నెలల క్రితం ఇదే వైసీపీ నాయకులు హిందూపురం నియోజకవర్గంలో టీడీపీ నుంచి భారీ వలసలు ఉంటాయని, ఇక టీడీపీ పని అయిపోయిందని, పెద్దిరెడ్డి స్కెచ్‌లు గీశారంటూ చెప్పుకొచ్చారు. కానీ ఆ పార్టీలోకి వెళ్లిన కథ దేవుడెరుగు కానీ.. అధికార పార్టీ నుంచి ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్‌తో పాటు చిలమత్తూరు జడ్పీటీసీ, పలువురు కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు టీడీపీకి మారారు. పార్టీ వీడుతున్నా ఆ పార్టీ నాయకుల్లో చలనం కనిపించలేదు. ప్రతిపక్షంతో పోలిస్తే వైసీపీ ఆ దూకుడులో విఫలమైందని అధికార పార్టీ నాయకులే చర్చించుకుంటున్నారు. ఎవరైనా పార్టీ మారతారని తెలిస్తే ముఖ్యులు వారి వద్దకి వెళ్లి తాయిలాలు ఆశ చూపడం, బుజ్జగించడం చేస్తుంటారు. కానీ అలాంటివి ఎక్కడా కనిపించలేదు.

### నగదు పంపిణీకి పక్క జిల్లా నాయకులు..?

ఓటర్లకు నగదు పంపిణీ చేసేందుకు పొరుగు జిల్లా నాయకులు వస్తారని స్థానిక నాయకులు చర్చించుకుంటున్నారు. అది కూడా రేపే మాపో ప్రారంభమవుతుందని, స్థానిక నాయకులను నమ్మలేక పక్క జిల్లా నాయకులు వస్తారని చెప్పుకుంటున్నారు. దీని వల్ల స్థానిక నాయకులు గుర్రుగా ఉన్నారు. అసలు ప్రచారమే సరిగా నిర్వహించలేదు, నగదు పంపిణీకి పక్క జిల్లా నాయకులు వస్తారని చెప్పడంతో పుండు మీద కారం చల్లినట్లు ఉంది. అసలే నియోజకవర్గంలో ప్రచారం తూతూ మంత్రంగా సాగుతుండగా, మరో వైపు నగదు పంపిణీకి ఇతర జిల్లా నాయకులు వస్తున్నారని చెప్పడంతో స్థానిక నాయకులు రగిలిపోతున్నారు. మొత్తానికి హిందూపురం వైసీపీలో నైరాశ్యం నెలకొంది.



# స్మార్ట్‌సిటీగా అమ్మవారిపల్లి

## కియతో వెలుగులు

పది గ్రామాలకు మహర్దశ.. నాడు రైతు కూలీలు.. నేడు కోటీశ్వరులు

**పంటలు సాగుచేయడం.. నష్టాలపాలుకావడం.. అప్పులు చేయడం.. దినదినగండంగా బతకడం.. ఇది ఒకప్పటి పెనుకొండ రైతుల దుస్థితి.. కియ పరిశ్రమ రాకతో ఒక్కసారిగా వారి జీవితాలు మారిపోయాయి. కొత్త వెలుగులు ప్రసరించాయి. భూములకు రెక్కలు వచ్చాయి. వేల రూపాయలు పలికే భూములు కోట్లతో కొనుగోలు చేశారు. కొంత పరిశ్రమలకు పోగా.. మిగిలిన భూముల్లో వాణిజ్య సముదాయాలు నిర్మించి నెలనెలా ఆదాయం పొందుతున్నారు.**



అమ్మవారిపల్లిలో వెలసిన భవనాలు



**పెనుకొండ రూరల్:** ఒకప్పుడు సాగునీరు లేక వ్యవసాయం చేస్తూ పెట్టిన పెట్టుబడులు చేతికందక అప్పుల ఊబిలో కూరుకుపోయారు. అలాంటి వారి జీవితాల్లో కియ పరిశ్రమ ఏర్పడటంతో కొత్త వెలుగులు చిగురించాయి. కియ కార్లపరిశ్రమ రావడంతో అమ్మవారిపల్లి, కురుబవాండ్లపల్లి, గుట్టూరు, మునిమడుగు, దుద్దేబండ తదితర పది గ్రామాల కు మహర్దశ వచ్చింది. ఆ గ్రామాలు ఆర్థికం గా అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయి. పరిశ్రమ రాకతో యువతకు ఉద్యోగాలు, వ్యాపారపరంగా జీవన విధానం మెరుగుపడింది. చంద్రబాబు కృషి ఫలితంతో కియ పరిశ్రమ వచ్చిందని, ఆయన రుణం తీర్చుకుంటామని రైతులు పేర్కొంటున్నారు.

### పెద్ద పెద్ద భవనాల నిర్మాణం

కియ పరిశ్రమ రావడంతో ఐసీఐసీఐ, కెనరాబ్యాంక్, కొటక్ మహీంద్ర, తదితర బ్యాంకులు వెలిశాయి. పరిశ్రమకు రైతులు భూములు ఇవ్వడంతో వచ్చిన పరిహారంతో విలాసవంతమైన భవనాలు వెలిశాయి. ఒక్కో రైతుకు రూ.లక్ష నుంచి రూ.3లక్షల దాకా అద్దెలు వస్తున్నాయి. జాతీయ రహదారి ఆనుకుని ఉండడంతో పరిశ్రమకు అవసరమయ్యే పరికరాలు కంటైనర్ల ద్వారా నిత్యం వేల సంఖ్యలో కియ వద్ద అమ్మవారిపల్లిలో దర్శనమిస్తుండగా ఈ ప్రాంతం స్మార్ట్‌సిటీగా మారిపోయింది.

### ఆర్థికంగా ఎదుగుతున్నాం



గతంలో నాకున్న వ్యవసాయ పొలంలో వేరుశనగ సాగుచేసి తీవ్ర నష్టాలపాలయ్యా. పరిశ్రమ కోసం మూడున్నర ఎకరాలు ఇచ్చా. వచ్చిన పరిహారంతో ఇళ్లు నిర్మించుకున్నాం. రూ.40వేలు అద్దె వస్తోంది. ఆర్థికంగా ఎదుగుతున్నాం. చంద్రబాబు రుణం తీర్చుకోలేం.

**- రామాంజనేయులు, రైతు, అమ్మవారిపల్లి**

### చంద్రబాబు రుణం తీర్చుకుంటాం



మాకున్న 13 ఎకరాల్లో గతంలో టమోటా, మిరప, వేరుశనగ పంటలు సాగుచేసి గిట్టుబాటు ధరలేక ఇబ్బందులు పడేవాళ్లం. కియ పరిశ్రమకు 12 ఎకరాలు ఇచ్చాం. మిగిలిన భూమిలో ఇల్లు, భవనం నిర్మించుకున్నాం. నెలనెలా వస్తున్న అద్దెలతో ఆర్థికంగా ఎదుగుతున్నాం. 13న జరిగే ఎన్నికల్లో చంద్రబాబు రుణం తీర్చుకుంటాం.

**- వెంకటరెడ్డి, రైతు, అమ్మవారిపల్లి**

### బాబు చేసిన మేలు మరువలేం



గతంలో వ్యవసాయం చేసి తీవ్రంగా నష్టపోయాం. కియ పరిశ్రమకు ఏడెకరాలు ఇచ్చా. వచ్చిన పరిహారంతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాం. పరిశ్రమ రావడంతో చుట్టుపక్కల పది గ్రామాలు అభివృద్ధి చెందాయి. చంద్రబాబు నాయుడు చేసిన మేలు జీవితంలో మరువలేం.

**- భాస్కర్ రెడ్డి, రైతు, అమ్మవారి పల్లి**

## రూ.19.72 లక్షల నగదు పట్టివేత

**బ్రహ్మసముద్రం, మే 8 :** మండలంలోని పోలేపల్లి దగ్గర ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బుధవారం పోలీసులు భారీగా నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ పరశురాముడు తెలిపిన మేరకు.. బ్రహ్మసముద్రం మండలం కపటలింగనపల్లి రోడ్డు పోలేపల్లి వద్ద ఏర్పాటు చేసిన అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. ఓ ద్విచక్ర వాహనంలో కర్నాటక రాష్ట్రం చెళ్లకెర నుంచి రాయదుర్గం పట్టణానికి వెళుతున్న శివ, మంజు అనే ఇద్దరు వ్యక్తులను తనిఖీ చేసి వారి నుంచి రూ. 19,72,500 స్వాధీనం చేసుకున్నారు. వాటికి సరైన పత్రాలు చూపించకపోవడంతో నగదును స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. వీరిద్దరు కూడా అధికార పార్టీకి చెందిన వ్యక్తులు అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## అలాగైతే.. ఇలా చేయొచ్చు..!



**అనంతపురం టౌన్, మే 8:** ఎన్నికల రోజు పోలింగ్‌బూత్‌కు వెళ్లినపుడు అక్కడ మీ ఓటు లేకపోయినా.. ఓటరు జాబితాలో మీపేరు గల్లంతయినా.. మీ ఓటరు కార్డుతోపాటు ఆధార్‌కార్డు చూపించి సెక్షన్ 49 ఏ కింద చాలెంజ్ ఓటు వేయవచ్చు. మీ ఓటు అప్పటికే ఇతరులు వేసేసి వెళ్లినట్టయితే.. ఓటరు ధైర్యంగా టెండర్ ఓటు అడగొచ్చు. ఇలా ఏ బూత్‌లోనైనా 14శాతం దాటి టెండర్ ఓట్లు పోలైతే అక్కడ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రీపోలింగ్ నిర్వహిస్తారు.



వైసీపీ ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకుంటున్న బ్రాహ్మణపల్లి తండా యువకులు

## ఎన్నికలొస్తేనే.. గుర్తొస్తామా?

### ఏం చేశారని ఓట్లేయాలి?
### ఏ మొహం పెట్టుకుని ఓట్లడుగుతారు?
### వైసీపీ నాయకులను నిలదీసిన తండా యువకులు

**పుట్టపర్తి రూరల్, మే 8:** 'ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గెలిచాక ఐదేళ్లలో ఒక సారి మాత్రమే మా తండాకు వచ్చారు తప్ప.. అభివృద్ధి చేసిందేమీ లేదు. మళ్లీ ఐదేళ్లకు మా ఊరొచ్చారు. ఎన్నికలొస్తేనే గుర్తొస్తామా?' అంటూ ప్రచారానికి వచ్చిన వైసీపీ నాయకులను జిల్లా కేంద్రం పరిధిలోని బ్రాహ్మణపల్లి తండా యువకులు నిలదీశారు. ఈ పరిణామంతో వైసీపీ నాయకులు అవాక్కయ్యారు. వైసీపీ అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నాయకుడు సాయిరాంరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బ్రాహ్మణపల్లిలో ప్రచారం నిర్వహించారు. తమ తండాలో ప్రచారం చేయొద్దని కొంతమంది యువకులు అడ్డుకున్నారు. 'తండాలో అభివృద్ధే చేయని మీకు ఓట్లేసే ప్రసక్తే లేద'ని తెగేసి చెప్పారు. దీంతో కంగుతిన్న వైసీపీ నాయకులు అక్కడి నుంచి జారుకున్నారు.

## ఎన్నికల విధులు లేనివారికి పోస్టల్ బ్యాలెట్!

### హిందూపురంలో చోద్యం

### రెండో ఆర్డర్ విషయం తెలియదన్న నోడల్ అధికారి
### ఆర్‌ఓ, ఈసీకి ఫిర్యాదు చేస్తామన్న టీడీపీ నాయకులు
### అధికారిపై చర్యలకు డిమాండ్

**హిందూపురం, మే 8:** ఆయన మున్సిపల్ కమిషనర్. ప్రస్తుతం హిందూపురం నియోజకవర్గ ఎన్నికల నోడల్ అధికారి. ఎన్నికలకు సంబంధించిన ఆర్డర్ వచ్చిన విషయం తనకు తెలియదని చెప్పడం గమనార్హం. దీనిపై టీడీపీ నాయకులు మండిపడ్డారు. హిందూపురం నియోజకవర్గంలో 306 మందిని తొలుత ఎన్నికల విధులకు కేటాయించారు. ఆ తరువాత కొన్ని రోజులకు రెండో ఆర్డర్ ఎన్నికల సంఘం విడుదల చేసింది. అందులో 120 మందిని మాత్రమే ఎన్నికల విధులకు తీసుకుంటామని స్పష్టంగా తెలియజేశారు. మున్సిపల్ కమిషనర్, నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి దానిని పట్టించుకోకుండా 306 మందికీ పోస్టల్ బ్యాలెట్ ఇప్పించారు. విషయం బుధవారం వెలుగు చూసింది. టీడీపీ పొలిటికల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అభ్యర్థి నందమూరి బాలకృష్ణ, ఎలెక్షన్ చీఫ్ ఏజెంట్ జేవీ అనిల్‌కుమార్, నాగరాజు.. మున్సిపల్ కమిషనర్‌ను కలిశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో లేనివారికి పోస్టల్ బ్యాలెట్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. తనకు రెండో ఆర్డర్ వచ్చిన విషయం తెలియదని చెప్పుకొచ్చారు. కీలక బాధ్యతల్లో ఉండి తెలియదని చెప్పడం ఏంటని శ్రీనివాసరావు నిలదీశారు. ఉద్దేశపూర్వకంగానే విధుల్లో లేనివారికి పోస్టల్ బ్యాలెట్ ఇచ్చారంటూ మండిపడ్డారు. అధికార పార్టీకి మేలు చేసేందుకే ఇలా పోస్టల్ బ్యాలెట్ ఇచ్చారని ఆరోపించారు. దీనిపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు టీడీపీ నాయకులు తెలియజేశారు.



కమిషనర్‌ను నిలదీస్తున్న టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

## డీఐజీగా షేముషి బాజపాయి



**అనంతపురం క్రైం, మే 8:** అనంతపురం రేంజ్ డీఐజీగా డాక్టర్ షేముషి బాజపాయి నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఆమె ప్రస్తుతం రాజమహేంద్రవరం అర్బన్ ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు రావడంతో డీఐజీ అమ్మిరెడ్డిని ఎన్నికల కమిషన్ బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆ స్థానంలో నియమించేందుకు ముగ్గురు ఐపీఎస్ అధికారుల పేర్లతో జాబితా పంపాలని ఎన్నికల కమిషన్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో ప్రభుత్వం 2008 బ్యాచ్‌కు చెందిన రాజమహేంద్రవరం ఎస్పీ షేముషి, టీటీడీలో విధులు నిర్వర్తిస్తున్న గోపినాథ్ జెట్టి, చిత్తూరు ఎస్పీ ఎస్.సెంథిల్‌కుమార్ పేర్లను పంపింది. వీరిలో షేముషి పేరును ఎన్నికల కమిషన్ పరిగణనలోకి తీసుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన షేముషి. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం తొలుత ఆదోనిలో ఏఎస్పీగా, కృష్ణా జిల్లా ఏఎస్పీగా పనిచేశారు. 2013లో విశాఖపట్నం డీసీపీగా, 2014లో తొలిసారి మెదక్ జిల్లా ఎస్పీగా పనిచేశారు. 2015లో బాలానగర్ డీసీపీగా పనిచేసి, అనంతరం విజయవాడ రైల్వే ఎస్పీగా పనిచేశారు. బుధవారం సాయంత్రం 5 గంటల్లోగా బాధ్యతలు చేపట్టాలని ఎన్నికల కమిషన్ ఆమెను ఆదేశాలిచ్చింది.

## పుట్టపర్తిలో.. హోరాహోరీ

- వైసీపీ అభ్యర్థి దందాలపై జనంలో వ్యతిరేకత
- మితిమీరిన బంధువుల జోక్యం
- పల్లె సింధూరారెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మధ్యే పోరు





**పుట్టపర్తి, మే 8 :** సత్యసాయి అవతరించిన పుట్టపర్తికి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. సత్యసాయి బోధనలు సేవలను గుర్తించిన ప్రభుత్వం 2009లో పుట్టపర్తి కేంద్రంగా నియోజకవర్గాన్ని ఏర్పాటు చేసింది. జిల్లాల పునర్విభజనలో భాగంగా 2022లో పుట్టపర్తి కేంద్రంగా జిల్లా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీంతో పుట్టపర్తికి మరింత గుర్తింపు వచ్చింది. 2009 నుంచి మూడుసార్లు నియోజకవర్గం కేంద్రంగా ఎన్నికలు జరిగాయి. 2009, 2014లో రెండుసార్లు పల్లె రఘునాథరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పనిచేశారు. 2019లో వైసీపీ అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గెలిచారు. నియోజకవర్గంలో పుట్టపర్తి మున్సిపాలిటీ పుట్టపర్తిరూరల్, కొత్తచెరువు, బుక్కపట్నం, నల్లమాడ, ఓడీసీ, అమడగూరు మండలాలు ఉన్నాయి. 241 పోలింగ్‌కేంద్రాలు ఉన్నాయి. మొత్తం ఓటర్లు 2,16,635 ఇందులో పురుషులు 1,06,788 మంది, మహిళలు 1,09,835, ఇతరులు 12 మంది ఉన్నారు. పుట్టపర్తిలో ఇతర పార్టీల అభ్యర్థులు రంగంలో ఉన్నా ప్రధాన పోటీ టీడీపీ అభ్యర్థి పల్లె సిందూరారెడ్డి, వైసీపీ అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మధ్యే నెలకొంది. ఎమ్మెల్యేగా శ్రీధర్‌రెడ్డి చేసిన దందాలు ఆయనపై తీవ్ర వ్యతిరేకత నెలకొంది.

### ప్రతి పనికీ ఓ రేటు..



పుట్టపర్తి నియోజకవర్గంలో ఎవరు ఏ పనిచేసినా దానికొక రేటు కట్టి కమీషన్ కింద కొంత మొత్తం కప్పం చెల్లించాల్సిందే. పుట్టపర్తి పట్టణాభివృద్ధి పరిధిలో ఎక్కడ భవనం, అపార్టుమెంట్లు నిర్మించినా, లేఔట్లు వేసినా పుడా అనుమతులు ఎలా ఉన్నా ఎమ్మెల్యే అనుమతులు లేనిదే ఎలాంటి పనులు చేయరాదని నిబంధనలు ఉన్నాయి. ప్రతిదానికి ఒకరేటు కట్టి వసూలు చేస్తారనే విమర్శలు ఉన్నాయి.

### ఇసుక అక్రమ రవాణా



నియోజకవర్గంలో ముఖ్యమైన నది చిత్రావతి. ఆ తర్వాత స్థానం వంగపేరు, ఎమ్మెల్యే అనుచరులు ద్వారా ఇసుక అక్రమరవాణా చేసి కోట్లు కొల్లగొట్టారనే విమర్శలు ఉన్నాయి. చిత్రావతినదిని ఎడాపెడా తవ్వేసి నది రూపురేఖలను ఛిద్రం చేశారు.

### భూములు స్వాహా



ఎమ్మెల్యే కోట్లు విలువచేసే భూములను కొనడం, డబ్బులు చెల్లించకనే వాటిని రిజిస్ట్రేషన్ చేసుకోవడం, ఆ తర్వాత డబ్బులు ఇస్తానని చెప్పడమే కాని చెల్లించేది ఉండదు. ఇలా తన అనుచరులు ద్వారా ఇతరుల భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకోవడం, వాటిని కబ్జాచేయడం నియోజకవర్గంలో పరిపాటిగా మారింది.

### సొంత పొలాలకు సత్యసాయి నీరు

మూడు దశాబ్దాలుగా సత్యసాయి వాటర్ ప్రాజెక్టుద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఎమ్మెల్యే సొంతమండలం నల్లమాడలోని నల్లసింగయ్యపల్లెలో తన తోటకు సత్యసాయి తాగునీటి పథకం ప్రధాన పైపులైన్ నుంచి పెద్దపైపు ఏర్పాటు చేసుకుని నాలుగేళ్లుగా తనతోటకు మళ్లించి ఎమ్మెల్యే నీటిచౌర్యానికి పాల్పడ్డారు.

### సొంత పార్టీలోనే వ్యతిరేకత



పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిపై సొంతపార్టీలోనే బలమైన నాయకులు ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. వీరిలో పాముదుర్తి ఇంద్రజిత్‌రెడ్డి, కొత్తకోట సోమశేఖర్‌రెడ్డి, లోచర్ల విజయ్‌బాస్కర్‌రెడ్డి ముఖ్యులు. ఆది నుంచి శ్రీధర్‌రెడ్డికి టిక్కెట్ ఇవ్వకూడదంటూ వ్యతిరేకిస్తున్నారు. రెండోసారి కూడా శ్రీధర్‌రెడ్డికే టిక్కెట్ ఇవ్వడంతో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పదవికి, పార్టీ సభ్యత్వానికి లోచర్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి రాజీనామా చేశారు. మరికొంతమంది పార్టీనే వీడి టీడీపీలో చేరిపోయారు.

### ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి బలాలు

- నూతన జిల్లా ఏర్పాటు చేయడం
- ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు
- బలమైన వర్గాన్ని ఏర్పాటు చేసుకోవడం.
- బంధువర్గం ఎక్కువగా ఉండటం.

**బలహీనతలు**

- బుక్కపట్నం చెరువు ముంపు బాధితులకు పరిహారంపై మాట నిలుపుకోకపోవడం
- 193 చెరువులకు కృష్ణాజలాలతో నింపుతానని ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోవడం
- బలమైన నాయకులు వ్యతిరేకించడం
- కప్పలబండ పారిశ్రామికవాడలో ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు చేయకపోవడం
- మున్సిపల్ భవనం, చిత్రావతి సుందరీకరణ, భూగర్భడ్రైనేజీ విస్తరణ చేయకపోవడం
- జగనన్న కాలనీల్లో అనుచరుల కబ్జాలు, రియల్‌ఎస్టేట్ దందాలు

### టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి బలాలు

- మామ పల్లె రఘునాథరెడ్డి ఎమ్మెల్యే, మంత్రి, చీఫ్‌విప్‌గా పనిచేయడం
- మామ నిత్యం నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఆపదలో ఆదుకుంటుండడం
- ఉన్నత విద్యావంతురాలిగా మహిళల్లో ఆదరణ
- వైసీపీ అసమ్మతినేతలు టీడీపీలో చేరడం
- టీడీపీ అసమ్మతి నేతలు అందరూ వెంట నడవడం
- ఆర్థికంగా బలంగా ఉండటం

**బలహీనతలు**

- మొదటిసారి పోటీలో ఉండటం
- రాజకీయ అనుభవం లేకపోవడం
- స్థానికంగా లేకపోవడం
- పార్టీ నాయకులతో పరిచయాలు లేకపోవడం

## సంతకాలు చేసి పోండి..!

### అధికారుల బాధ్యతారాహిత్యం
### అనంత జూనియర్ కళాశాలలో ఓపీఓల ఆందోళన



సంతకాలు చేయడానికి ఎగబడుతున్న ఓపీఓలు

**అనంతపురం టౌన్, మే 8:** అనంతపురం అర్బన్ నియోజకవర్గ ఎన్నికల అధికారుల బాధ్యతారాహిత్యం మరోసారి బయటపడింది. సరైన ఏర్పాట్లు చేపట్టకపోవడంతో ఓపీఓలు అధికారుల తీరుపై బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆందోళనకు దిగారు. అనంతపురం నియోజకవర్గంలో ఈనెల 13న జరిగే పోలింగ్‌కు ఇతర నియోజకవర్గాలకు చెందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులను నియమించారు. వీరందరినీ బుధవారం అనంతపురం జూనియర్ కళాశాలలో శిక్షణకు హాజరుకావాలని ఆదేశించారు. దీంతో దాదాపు 1400 మంది వచ్చారు. ఇక్కడ వారికి ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. కనీసం ఎన్నికల నిర్వహణలో పాటించాల్సిన జాగ్రత్తలను కూడా చెప్పలేదు. వచ్చిన వారందరు రిజిస్టర్‌లో సంతకాలు చేసి పోవాలన్నారు. దానికి కూడా సరైన ఏర్పాట్లు లేక గంటల తరబడి నిలబడడం, పైగా ఉక్కపోతకు అల్లాడిపోయారు. దీంతో ఒక్కసారిగా అధికారుల తీరును నిరసిస్తూ ఆందోళన చేపట్టి నినాదాలు చేయడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. అక్కడ ఉన్న తహసీల్దార్ వారిని మైక్ ద్వారా సముదాయించడం కనిపించింది.

## పట్టాల పంపిణీలోనూ తోపు రాజకీయం..!

**79 మంది వైసీపీ వారే..**



మూడు నెలల కిందట గ్రామంలోని వారికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఇందులో ఎక్కువ శాతం మంది వైసీపీ వారే ఉన్నారు. గ్రామంలో 80 మందికి పట్టాలు ఇస్తే.. అందులో 79 మంది వైసీపీకి చెందిన వారే ఉన్నారు. పట్టాలు పొందినవారికి ఇంత వరకు స్థలాలు కూడా చూపించలేదు. అంతే కాకుండా తెల్లకాగితంపై ఫొటోలు అతికించి ఇంటి పట్టా అంటూ ఇచ్చారు. ఇలాంటి పట్టాలు ఎప్పుడు చూసింది లేదు.

**- ఎల్లప్ప, కొడిమి**

**అనంతపురంరూరల్, మే 8:** అర్హతే ప్రామాణికం..అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇస్తాం అంటూ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు నిత్యం జనం ముందు చెప్పే మాటలు. వారి మాటలకు చేతలకు పొంతన ఉండదని జనం నుంచి వినిపిస్తున్న మాట. రూరల్ మండలం కొడిమి పంచాయతీలో ఇళ్ల పట్టాల పంపిణీ ఇందుకు నిదర్శనమని గ్రామస్థులు అంటున్నారు. కొడిమి పట్టాల పంపిణీలో వైసీపీ సానుభూతి పరులకే అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. ఎక్కడైన తమ పార్టీ వారైతే..ఒకటి రెండు ఎక్కువ ఇచ్చే సందర్భాలుంటాయి. ఇక్కడ మాత్రం దాదాపు వైసీపీ సానుభూతి పరులే ఉన్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలో అధికార పార్టీకి చెందిన వారేనా అర్హులు.. మరె

### వైసీపీ వారికే అధిక ప్రాధాన్యం

పరిధిలోని వారికి కొడిమి గ్రామ సమీపంలోని సర్వే నెంబరు 149,136లో పట్టాలు పంపిణీ చేశారు. ఇందులో పాపంపేట పరిధిలోని 266 మందికి, నరసనాయనికుంట 38 మందికి, కొడిమిగ్రామ పరిధిలో 80 మందికి ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. కొడిమి గ్రామంలో ఇళ్ల పట్టాలు పొందిన వారిలో వైసీపీ సానుభూతి పరులే అధికంగా ఉన్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. 80మందిలో దాదాపు వైసీపీ వారే ఉన్నట్లు చెబుతున్నారు. గ్రామంలో పదుల సంఖ్యలో పేదలు ఉన్నా.. వారందరూ లేరా అని గ్రామస్థులు మండిపడుతున్నారు. ఇదేనేమో..తోపుదుర్తి వారి రాజకీయమంటే అని పెదవి విరుస్తున్నారు.

### పట్టాలన్నీ వైసీపీ వారికే..

మండలంలోని నరసనాయనికుంట, కొడిమి, పాపంపేట



ఇళ్ల స్థలాలకు కేటాయించిన స్థలం

రినీ పక్కన బెట్టి వైసీపీ నాయకులు చెప్పిన..ఆ పార్టీ వారికే ఎక్కువగా ఇచ్చినట్లు గ్రామంలో చర్చించుకుంటున్నారు. గ్రామ సమీపంలో ఇళ్ల పట్టాలు పొందిన వారికి ఇంత వరకు స్థలాలు చూపలేదంటున్నారు. పేరుకు మాత్రమే పట్టాలు పంపిణీ చేసి..స్థలాలు చూపించలేదంటున్నారు. సాధారణంగా ఇళ్ల స్థలాలను సిద్ధం చేసి లబ్ధిదారులకు కేటాయించాల్సి ఉంటుంది. ఇక్కడ అదేమీ లేకుండానే పట్టాలు పంపిణీ చేశారు.

**అర్హులను వదిలేశారు**



గ్రామం, పంచాయతీ పరిధిలోని కాలనీల్లో వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చి కూలి పనులు చేసుకుంటూ ఇక్కడే ఉంటున్నారు. అలాంటి వారందకి ఇళ్లపట్టాలు ఇవ్వకుండా వదిలేశారు. కేవలం అధికార పార్టీ నాయకులకు, నాయకులు చెప్పిన వారికి.. ఆపార్టీ సానుభూతి పరులకు పట్టాలు ఇచ్చారు. గతంలో ప్రభుత్వంలో పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన వారందరికీ పట్టాలు ఇచ్చారు.

**- బ్యాళ్ల రాము, కొడిమి**



గోవిందవాడ రోడ్‌షోలో మాట్లాడుతున్న అంబికా లక్ష్మీనారాయణ



గోనబావిలో అంబికాకు గజమాలతో నాయకుల సత్కారం

## వైసీపీని ఇంటికి పంపే సమయమొచ్చింది

### అనంతపురం టీడీపీ ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ

**బొమ్మనహాళ్, మే 8:** ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులు, యువత, నిరుద్యోగులు, ఉద్యోగులు.. ఇలా అన్ని రంగాల వారు ఇబ్బందులకు గురయ్యారని, ఆ పార్టీని ఇంటికి పంపించే సమయం ఆసన్నమైందని అనంతపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గోవిందవాడ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు, బీజేపీ ఇన్‌చార్జ్ వసుంధరదేవి, జనసేన ఇన్‌చార్జ్ మంజునాథ్‌తో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా అంబికా మాట్లాడుతూ వైసీపీ మాయమాటలతో ఒక్క అవకాశం ఇచ్చి అన్ని రంగాల వారు తమ జీవితాలను నాశనం చేసుకున్నారని తెలిపారు. రైతులు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలన్నా, నిరుద్యోగులకు ఉద్యోగాలు రావాలన్నా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా అధికారంలోకి రావాలని, నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని కావాలని అన్నారు. ఈ ఐదేళ్ల అరాచకపాలనలో ప్రజలు నలిగిపోయారని, ఏ వర్గం వారు సంతోషంగా లేరని చెప్పారు. జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత మద్యపాన నిషేధం చేసిన తర్వాతే మళ్లీ ఓట్లు అడుగుతామని చెప్పి నాసిరకం మద్యాన్ని అమ్మించి ప్రజల జీవితాలతో చెలగాటమాడారని అన్నారు. ఎన్‌డీఏ కూటమి మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలతో ప్రజల జీవితాలు బాగుపడతాయన్నారు. గోవిందవాడ గ్రామంలో ప్రజలు అడుగడుగునా నీరాజనం పలికారు. స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.

### టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి : అంబికా

**గుమ్మఘట్ట:** తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని అనంతపురం ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం గుమ్మఘట్ట మండలం గోనబావి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు. కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ ఆధ్వర్యంలో ఆయన గ్రామానికి చేరుకోగా అక్కడ ప్రజలు ఘనస్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆనందాలు పంచుకున్నారు. వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమే అని ఆశాభావం వ్యక్తం చేశారు.

## రాక్షస పాలనకు చరమగీతం పాడుదాం

### హిందూపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి

**రొద్దం, మే 8:** రాష్ట్రంలో సాగుతున్న అవినీతి రాక్షస పాలనకు చరమగీతం పాడుదామని హిందూపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి ప్రజలను కోరారు. బుధవారం రొద్దం మండల పరిధిలోని వైటీరెడ్డిపల్లి, రంగాపురం, దొడగట్ట, డీఆర్ కొట్టాల, రెడ్డిపల్లి, గోనిమేకలపల్లి, పెద్దగువ్వలపల్లి, ఆర్.కొట్టాల, ఆర్.మరువపల్లి, రొద్దం, తిమ్మాపురం, బూదిపల్లి, శేషాపురం, కలిపి, కె.మరువపల్లి గ్రామాల్లో బీకే పార్థసారథి, పెనుకొండ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా బీకే పార్థసారథి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ కాలంలో పెనుకొండ నియోజకవర్గంలో రూ.1500కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని విమర్శించారు. రొద్దం, పావగడ, ప్రధాన రోడ్డును రూ.30కోట్లతో అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. తొమ్మిది జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలకు భవనాలు నిర్మించామన్నారు. రూ.35కోట్లతో ఎంజేపీ పాఠశాలకు నిధులు తీసుకొస్తే వైసీపీవారు పునాదులకే పరిమితం చేశారని తెలిపారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి చెరువులకు నీరందించామని అన్నారు. రొద్దంలో వీధివీధికి సీసీ రోడ్లు వేశామన్నారు. ప్రతి గ్రామానికి కమ్యూనిటీహాలు నిర్మించామని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో తాగునీటి సౌకర్యాలు, సీసీరోడ్లు, అభివృద్ధి చేశామన్నారు. అభివృద్ధి చేసేవారికే ప్రజలు పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. వైసీపీ వారి కల్లబొల్లి మాటలకు మోసపోకుండా ఒక్కక్షణం ఆలోచించి మంచి చేసేవారికి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జీవీపీ నాయుడు, మాధవనాయుడు, సుబ్బరత్నమ్మ, నరసింహులు, రామకృష్ణప్ప, నరహరి, కురుబ కృష్ణమూర్తి, నరసింహులు, చిన్నప్పయ్య, ఆర్. కొట్టాల శ్రీనాథ్‌చౌదరి, తిరుపాల్‌నాయుడు, దొడగట్ట రామచంద్ర, శేషాపురం అరుణ్‌రెడ్డి, వీరాంజనేయులు, వాల్మీకి చంద్రశేఖర్, టైలర్ ఆంజనేయులు పాల్గొన్నారు.



పెద్ద గువ్వలపల్లిలో బీకే, సవితను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

## వైసీపీ మహిళా నేతలు టీడీపీలోకి చేరిక


టీడీపీలోకి చేరిన వారితో పరిటాల శ్రీరామ్

**ధర్మవరం రూరల్, మే8:** పట్టణంలోని 25వ వార్డు ప్రియాంకనగర్‌కు చెందిన వైసీపీ సీనియర్ నాయకురాలు మాచిరెడ్డి విజయలక్ష్మితోపాటు మరో ఐదుగురు బుధవారం టీడీపీలోకి చేరారు. స్థానిక పరిటాల క్యాంపు కార్యాలయంలో వారు నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌ను కలిసి ఆయన సమక్షంలో చేరారు. వారికి శ్రీరామ్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో సత్యకుమార్, బీకే పార్థసారథి గెలుపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు తలారి చంద్రమోహన్, వార్డు ఇన్‌చార్జి భీమినేనిప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ కుయుక్తులు

- సత్యకుమార్ ప్రచారానికి వస్తున్నారని ఇంటింటికీ సిద్ధం స్టిక్కర్లు అతికించిన వైనం
- మండిపడుతున్న ప్రతిపక్షాలు



పోతుకుంట బృందావనం కాలనీలో ఇంటికి అతికించిన సిద్ధం సిక్కర్

**ధర్మవరంరూరల్, మే8:** కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ గురువారం మండలంలోని పోతుకుంట, బృందావనం కాలనీ, కుణుతూరు గ్రామాలకు ఎన్నికల ప్రచారానికి వెళ్ల నున్నారు. అయితే ఆయా గ్రామాల్లోని వైసీపీ నాయకులు కుయుక్తులకు తెరలేపారు. బుధవారం రాత్రి ఆయా గ్రామాల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఇళ్లబయట గోడలకు, వాకిళ్లకు సీఎం జగన్ ఫొటో ఉండే సిద్ధం స్టిక్కర్లు అతికించారు. దీంతో గ్రామస్థులు మండిపడుతున్నారు. ఎవరిని అడిగి ఈ స్టిక్కర్లు అతికించారని మహిళలు సైతం శాపనార్థలు పెడుతున్నారు. ప్రచారాలకు వస్తే ఇలాంటి చర్యలకు పాల్పడటం తగదని, ఇంతకముందు ఎమ్మెల్యే ప్రచారం చేసినప్పుడు ఎవరూ ఇలాంటి చర్యలకు పాల్పడలేదని ఇప్పుడు ఎందుకు ఇలా చేస్తున్నారని ఆయా గ్రామాల్లోని ప్రతిపక్షాల వారు మండిపడుతున్నారు.

### ఇళ్లకు వైసీపీ స్టిక్కర్లు



ధర్మవరంలో ఇంటి తలుపునకు ఉన్న వైసీపీ స్టిక్కర్

**ధర్మవరం:** పట్టణంలో పలు వార్డులలో ఇళ్లకు వైసీపీ శ్రేణులు సిద్ధం స్టిక్కర్లను అతికిస్తూ ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. వైసీపీ మేనిఫెస్టో తుస్సుమనడంతో ఎలాగైనా గెలవాలనే విధంగా ప్రచారం సాగిస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణంలో పలు వార్డుల్లో ప్రచారాలు నిర్వహిస్తూ ఇళ్లకు సిద్ధం స్టిక్కర్లను అతికిస్తున్నారు. కొన్నిప్రాంతాల్లో ఇళ్లకు రాత్రి కిరాత్రే స్టిక్కర్లు అతికించే పని పూర్తిచేస్తున్నారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని చెబుతుంటే.. క్షేత్రస్థాయిలో మాత్రం ఇది అమలు కావడంలేదని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పేర్కొంటున్నారు. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని, ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరిస్తున్నారు.

## పీపుల్స్ మేనిఫెస్టో విడుదల

**ధర్మవరం, మే 8:** పట్టణంలోని సీతారామయ్య జూనియర్ కళాశాలలో బుధవారం జేవీవీ నాయకులు పీపుల్స్ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా జేవీవీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ బషీర్ మాట్లాడుతూ... సాధారణ ఎన్నికలలో పోటీ చేస్తున్న రాజకీయ పార్టీలు దేశం కోసం, భావితరాల ఉజ్వల భవిష్యత్తుకోసం, ప్రజలపక్షాన జేవీవీ పీపుల్స్ మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను అమలు చేయాలన్నారు. సైన్స్‌ను శాస్త్రీయపద్ధతులను ప్రోత్సహించేవిధంగా రాబోయే ప్రభుత్వాలు ఉండాలన్నారు. అనంతరం జేవీవీ జిల్లా ప్రధానకార్యదర్శిడాక్టర్ ఆదిశేష మాట్లాడుతూ... విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చర్యలు ఉపసంహరించుకోవాలని, రాజ్యాంగ పరిరక్షణ, ఎన్నికల కమిషన్, సీబీఐ, ఈడీలాంటి సంస్థలను నిష్పక్షపాతంగా, స్వతంత్రంగా పనిచేసేలా బలమైన చట్టం తేవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ సీతారామయ్య, జేవీవీనాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, నరేంద్రబాబు, లోకేశ్, పర్వతయ్య, సురేశ్, ఖలందర్, ప్రసాద్, నరేంద్ర, గంగాధర్,నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ హైస్కూల్ జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్

**ఓబుళదేవరచెరువు, మే 8:** మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసినట్లు పాఠశాల హెచ్‌ఎం శోభారాణి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ జయచంద్ర బుధవారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు హైస్కూల్ ప్లేస్ జూనియర్ కళాశాలగా (ఇంగ్లిష్ మీడియంగా) మార్పుచేసినట్లు చెప్పారు. 2023-24లో టెన్త్ ఉత్తీర్ణులైన మండల విద్యార్థులకు ఇక్కడ ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతి గ్రూపునకు 40మంది విద్యార్థులకు అవకాశముంటుందన్నారు. కావున విద్యార్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోరారు.

## పాల ఏకరి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడి ఎంపిక

**ఓబుళదేవరచెరువు, మే 8:** అఖిలభారత పాల ఏకరి సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా మండలానికి చెందిన ఆర్‌వీ లక్ష్మీనరసింహ నాయుడు (అప్పయ్యనాయుడు) ఎంపికయ్యారు. ఈమేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు తిప్పనేని రామదాసప్పనాయుడి నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు బుధవారం ఆయన ప్రకటనలో తెలిపారు. పాల ఏకరుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తన ఎంపికకకు సహకరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## 11న సాయంత్రం ఎన్నికల ప్రచారం ముగించాలి : ఆర్‌ఓ

**పెనుకొండ టౌన్, మే 8:** సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఈ నెల 13న జరుగనుందని, దీంతో ఈ నెల 11 వ తేదీ సాయంత్రం 5గంటలలోగా ఎన్నికల ప్రచారం ముగించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అపూర్వభరత్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలు 2024 దృష్ట్యా ఈనెల 13న ఓటింగ్ జరుగనుందని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని పోలింగ్‌కు 48 గంటల్లోపే నిలిపివేయాలన్నారు. లేనిపక్షంలో ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటా మనా ఆర్‌ఓ తెలిపారు.

## ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం


సమావేశంలో పాల్గొన్న కలెక్టరు, ఎన్నికల పరిశీలకులు

**పుట్టపర్తి, మే 8:** ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడంలో మైక్రో అబ్జర్వర్ల (సూక్ష్మ పరిశీలకుల) పాత్ర కీలకమైనదని ఎన్నికల సాధారణ పరిశీలకుడు అన్బుకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని సాయి ఆరామంలో బుధవారం మైక్రోఅబ్జర్వర్లకు ఒకరోజు ఓరియేంటేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకుడు మాట్లాడుతూ ఆయా పోలింగ్‌కేంద్రాలలో ఓటింగ్ రహస్యంగా ప్రశాంతంగా జరగాలన్నారు. ఓటర్ మినహా ఎవరినీ పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. ముందస్తు ప్రణాళికతో పోలింగ్ రోజుకు సిద్ధం కావాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి అరుణ్ బాబు మాట్లాడుతూ.. ఓటింగ్ ప్రారంభానికి మందు 90 నిముషాల ముందే మైక్రోఅబ్జర్వర్లు పోలింగ్ స్టేషన్లలో ఉండాలన్నారు. మాక్‌పోల్‌ను జాగ్రత్తగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, సచివాలయ నోడల్ అధికారి శివారెడ్డి, మాస్టర్ ట్రైనర్ సూర్యనారాయణ, ఈడీటీ మైనుద్దీన్ పాల్గొన్నారు.

# అవినీతి పాలనను అంతం చేద్దాం: మాజీ మంత్రి పల్లె


నల్లమాడలో రోడ్‌షో చేస్తున్న పల్లె రఘునాథరెడ్డి, పల్లె సింధూర

**నల్లమాడ, మే 8:** రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న అవినీతి పాలనను ఎన్నికల్లో ఓటు ద్వారా అంతం చేద్దామని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. నల్లమాడ క్రాస్ నుంచి స్థానిక బస్టాండ్ కూడలి వరకు బుధవారం ఆయన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరతో కలిసి ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించారు. స్థానిక నాయకులు పూలమాలలు వేసి, బాణసంచా కాల్చి, పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. బస్టాండ్ కూడలిలో పల్లె మాట్లాడుతూ.. ఐదేళ్ల పాలనలో సీఎం జగన్ ప్రజలకు ఎలాంటి మంచి చేయలేదన్నారు. అవినీతి, దౌర్జన్యాలు, అరాచకాలతోనే పాలన సాగించారన్నారు. ఇటీవల ల్యాండ్ టైట్లింగ్ యాక్టు చేపట్టడం దుర్మార్గపు చర్య అన్నారు. ఈ యాక్టు వల్ల మన భూములు జగన్ చేతుల్లో ఉంటాయన్నారు. మన భూముల్ని మనం అమ్ముకోవాలన్నా అతని అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇదేమి దౌర్భాగ్యమని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇలాంటి అరాచకపాలనకు అంతం పలకాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కూటమిని గెలిపించాలని కోరారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరను, ఎంపీగా బీకే పార్థసారథిని గెలిపించాలని అభ్యర్థించారు. పల్లె సింధూర మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల వల్ల అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. చంద్రబాబు సీఎం అవగానే వాటిని అమలు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్, మాజీ కన్వీనర్ కేశవరెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

### టీడీపీలోకి చేరికలు

**ఓబుళదేవరచెరువు:** మండలంలోని సున్నంపల్లి పంచాయతీలో చౌడేపల్లికి చెందిన ముగ్గురు వలంటీర్లు అమర్, మహేంద్ర, శ్రావణితోపాటు 25 కుటుంబాల వారు, గౌనిపల్లికి చెందిన 20 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. పుట్టపర్తిలోని టీడీపీ కార్యాలయంలో మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి సమక్షంలో చేరారు. వారికి పల్లె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

### పల్లె సింధూర ప్రచారం..

**నల్లమాడ:** మండలంలోని బాసంవారిపల్లి, చెరువువాండ్లపల్లి, కొత్తపల్లి, కుటాలపల్లిలో పల్లె సింధూర ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలకు సూపర్ సిక్స్ పథకాల వల్ల గలిగే ప్రయోజనాల గురించి వివరించారు. చంద్రబాబు సీఎం అవగానే అమలు చేస్తారన్నారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

### కూటమిని గెలిపించండి : పల్లె కిశోర్


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పల్లె కిశోర్

**కొత్తచెరువు:** మండలకేంద్రంలోని బసవన్నకట్ట, ముస్లిం, బోయవీధులలో టీడీపీ యువ నాయకుడు పల్లె కృష్ణకిశోర్ రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తొలుత బసవన్నగుడిలో పూజలు చేయించారు. తర్వాత ఇంటింటా తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేసి కూటమిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కూటమి అధికారంలోకి వస్తే చేపట్టే అభివృద్ధి పనులను, పథకాలను వివరించారు. ముఖ్యం గా సూపర్ సిక్స్ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని వివరించారు. చంద్రబాబు సీఎం అవగానే వాటిని అమలు చేస్తారని తెలిపారు. ఎమ్మెల్యేగా పల్లె సింధూరను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు పాల్గొన్నారు.

# చంద్రబాబుతోనే సుపరిపాలన: కందికుంట


జౌకలలో ప్రచారం చేస్తున్న కందికుంట


తనకల్లు రోడ్‌షోలో మాట్లాడుతూ..

**నంబులపూలకుంట, మే 8:** చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని, ఆయన సీఎం అయితే అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలో తూర్పునడింపల్లి, జౌకల, రంగనపల్లి, ఓర్సువాండ్లపల్లి, తాటిమానుగుంత, గౌకనపేట తదితర గ్రామాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. గ్రామాల్లో ప్రజలు, నాయకులు పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతి పట్టారు. తర్వాత ఆయన ఇంటింటా తిరిగి ప్రజల్ని ఆప్యాయంగా పలకరిస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాలతో చంద్రబాబు అన్నివర్గాల ప్రజలకు సుపరిపాలన అందించనున్నారని తెలిపారు. అనంతరం రంగనపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి రాగానే ఉచితంగా ఇసుకను పంపిణీ చేసి సామాన్యుల సొంతింటి కలను నేరవేరుస్తామన్నారు. జగన్ ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ యాక్టు తీసుకురావడం దుర్మార్గపు చర్య అన్నారు. ఈ యాక్టుతో మన ఆస్తులను ఆయన వద్ద తాకట్టు పెట్టాల్సి వస్తుందన్నారు. ఆస్తులు, రిజిస్ట్రేషన్ డబ్బు ఖర్చులు ప్రజలవి, ఫొటోలు మాత్రం జగన్‌వి ఉంటాయన్నారు. ఈయాక్టు ద్వారా ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. ఈయాక్టు తీసుకొచ్చిన జగన్ ప్రభుత్వానికి ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కూటమి అధికారంలోకి రాగానే ల్యాండ్ టైట్లింగ్ యాక్టును పూర్తిగా తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

### నియోజకవర్గంలోని చెరువులన్నింటికీ నీరందిస్తాం

**తనకల్లు:** కదిరి నియోజకవర్గంలోని అన్ని చెరువులకు హంద్రీనీవా నీటిని అందిస్తామని కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్ హామీ ఇచ్చారు. మండలంలోని కోటూరు గ్రామం నుంచి తనకల్లు వరకు ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించారు. స్థానిక నాయకులు అడుగడుగునా పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. రెండుకిలోమీటర్ల రోడ్‌షో నిర్వహించడానికి దాదాపు నాలుగు గంటల సమయం పట్టింది. రోడ్డు పొడవునా మహిళలు కోలాటం, కళాకారులు చెక్కభజనలు, కీలుగుర్రాలతో సందడి చేశారు. తనకల్లులోని అంబేడ్కర్ సర్కిల్లో కందికుంట మాట్లాడారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం కట్టుబడి ఉన్నామన్నారు. కూటమి అధికారంలోకి రాగానే నియోజకవర్గంలోని అన్ని చెరువులకు హంద్రీనీవా నీటిని నింపుతామన్నారు. గిరిజనతండాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మౌలిక సదుపాయలు కల్పిస్తామన్నారు. పంచాయతీల సర్పంచ్‌లకు విధులతో పాటు నిధులు కూడా కేటాయిస్తామన్నారు. సీజీ ప్రాజెక్టు వద్ద గిరిజన బాలికల జూనియర్ కళాశాల నెలకొల్పుతామని హామీ ఇచ్చారు. ముస్లిం, మైనార్టీల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నామన్నారు. ఇక చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు అన్నివర్గాల అభ్యున్నతికి సహకరిస్తాయన్నారు. ఈనెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, కూటమి నాయకులు ఈశ్వరెడ్డి, శంకర్‌నాయుడు, రాజారెడ్డి, దేశాయి విదురశేఖర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రవీంద్రారెడ్డి, బాగేపల్లి చలపతి, కుమార్, తోట సరోజమ్మ కార్యకర్తలుపాల్గొన్నారు.

### మృతుడి కుటుంబానికి పరామర్శ

**నంబులపూలకుంట:** మండలంలోని గౌకనపేట టీడీపీ కార్యకర్త నాగభూషణం మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న కందికుంట వెంకటప్రసాద్ బుధవారం గౌనపేటకు వెళ్లారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

# సత్యకుమార్ ముమ్మర ప్రచారం


ముదిగుబ్బలో సత్యకుమార్‌కు గజమాల వేస్తున్న కూటమి శ్రేణులు

**ముదిగుబ్బ, మే8:** మండల కేంద్రంలోని చర్చి వీధి, చెలిమిబావి వీధి, టీచర్స్ కాలనీ, ఎస్టీ కాలనీ, వడ్డిపేట, దొరిగల్లు రోడ్డు, ఆర్ అండ్‌బీ బంగ్లా వీధి, సాయినగర్‌లలో బుధవారం కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా చేపట్టారు. తొలుత స్థానిక నాయకులు గజమాలలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్నామని పలువురు తెలిపారు. దీంతో ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రాగానే వాటిని వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కమలం గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, సైకిల్ గుర్తుకు ఓటు వేసి బీకే పార్థసారధిని ఎంపీగా భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తర్వాత విలేకరులతో మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే మండల కేంద్రంలోని ఈద్గా, కబరస్థాన్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అలాగే మండలంలో చుక్కల భూముల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కబ్జాలకు గురైన భుములపై విచారణ చేయిస్తామన్నారు. 30 పడకల ఆసుపత్రిని, మహిళా డిగ్రీ కళాశాలను తీసుకొస్తామని, హిందువులకు శ్మశానవాటికను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం స్థానికంగా ఉన్న 20 కుటుంబాలవారు సత్యకుమార్ ఆధ్వర్యంలో బీజేపీలోకి చేరారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు పాల్గొన్నారు.

### గూడ్స్‌షెడ్‌కొట్టాలలో సత్యకుమార్ సతీమణి ప్రచారం

**ధర్మవరం:** పట్టణంలోని 1వవార్డు గూడ్‌షెడ్‌కొట్టాలలో సత్యకుమార్ సతీమణి త్రివేణి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కమలం గుర్తుకు ఓటువేసి సత్యకుమార్‌ను ఎమ్మెల్యేగా, సైకిల్ గుర్తుకు ఓటు వేసి బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. సత్యకుమార్ గెలిస్తే ధర్మవరంలో చేనేత పరిశ్రమకు పూర్వవైభవం తీసుకొస్తారన్నారు. అలాగే నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మాజీ ఎంపీ నిమ్మల ప్రచారం


ప్రచారంలో పాల్గొన్న నిమ్మల కిష్టప్ప

**ధర్మవరం:** పట్టణంలోని నేసేపేటలో మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కమలం గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా సత్యకుమార్‌ను, సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని ప్రజల్ని కోరారు. ఇక్కడ అసెంబ్లీ అభ్యర్థిగా ఎన్నో ఏళ్ల తరువాత బీసీ నాయకుడికి అవకాశం వచ్చిందని, దీంతో బీసీలందరూ సత్యకుమార్‌కు మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం

**నంబులపూలకుంట, మే 8:** మండలంలోని ధనియాన్‌చెరువు పంచాయతీ కేంద్రంతో పాటు గోవిందురాజులపల్లి, సోమరాజుకుంట, గొల్లపల్లి, కొట్టంవారిపల్లి, ముండ్లవారిపల్లి గ్రామాల్లో బుధవారం టీడీపీ శ్రేణులు సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ ఆ పథకాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కుటుంబంలో ఎవరెవరికి ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో తెలియజేశారు. చంద్రబాబు సీఎం కాగానే వాటిని అమలు చేస్తారన్నారు. కనుక ఎన్నికల్లో కూటమిని గెలిపించాలని కోరారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్‌ను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని అభ్యర్థించారు. తొలుత వారు ధనియాన్ చెరువలోని కదిరి, రాయచోటి ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డెప్ప, హనుమంతరెడ్డి, పురుషోత్తమరెడ్డి, రమణారెడ్డి, అజుం, హరిప్రసాద్, అక్కులప్ప, వెంకటరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నల్లచెరువు:** మండలంలోని కె.పూలకుంట, దామావాండ్లపల్లి గ్రామాల్లో టీడీపీ మండల నాయకులు సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వాటి గురించి అవగాహన కల్పించారు. ఈ పథకాల వల్ల అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ముఖ్యంగా మహిళలకు ఎంతో ప్రయోజనం ఉందన్నారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. దామావాండ్లల్లిలో నగేష్ కుటుంబ సభ్యులు ఎంపీపీ మాబూసాబ్ సమక్షంలో టీడీపీలోకి చేరారు. వారికి మూబూసాబ్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు బయప్ప, అమరనాథ్, కిరణ్‌కుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

**తనకల్లు:** మండకేంద్రంలో బీజేపీ నాయకులు సురేష్‌గోపీ, నరేష్, టీడీపీ దళిత నాయకుడు చిన్నప్ప సూపర్ సిక్స్‌పథకాలపై ఇంటింటా ప్రచారం చేశారు. కూటమి అధికారంలోకి రాగానే పథకాలు అమలవుతాయన్నారు. ఆ పథకాల వల్ల అన్ని వర్గాల వారికి లబ్ధి చేకూరుతుందని వివరించారు. కనుక ఎన్నికల్లో కూటమి విజయానికి సహకరించాలని కోరారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్‌ను, ఎంపీగా బీకే పార్థసారధిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 551 మంది పోస్టల్‌బ్యాలెట్ వినియోగం


ధర్మవరంలో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఉద్యోగులు

**ధర్మవరం రూరల్, మే 8:** పట్టణంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ బుధవారం కూడా ప్రశాంతంగా ముగిసింది. స్థానిక బీఎస్‌ఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో నియోజకవర్గవ్యాప్తంగా ఎన్నికల విధుల్లో ఉన్న 454మంది ఉద్యోగులు, ఇతర నియోజకవర్గాల్లో విధులు నిర్వర్తించే 97మంది ఉద్యోగులు కలిసి మొత్తం 551 మంది ఓటుహక్కు వినియోగించుకున్నట్లు ఆర్‌ఓ వెంకట శివరామిరెడ్డి తెలిపారు. పోలింగ్ కేంద్రంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు గట్టిబందోబస్తు నిర్వహించారు.

## ఈవీఎం వినియోగంపై అవగాహన

**గాండ్లపెంట, మే 8:** మండల వ్యాప్తంగా బుధవారం టీడీపీ నాయకులు ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. మండలకేంద్రంతో పాటు గొడ్డివెలగల, మల్లమీదపల్లి, చామాలగొంది తదితర గ్రామాల్లో ఓటర్లకు నమూన ఈవీఎం ద్వారా అవగాహన కల్పించారు. ఈవీఎం ద్వారా నచ్చిన అభ్యర్థికి ఓటు ఎలా వేయాలనేదానిపై క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కొండయ్య, సింగల్ విండో మాజీ ప్రెసిడెంట్ వెంకటరమణారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి ప్రసాద్, ఎంపీటీసీలు జయరామక్రిష్టారెడ్డి, సోముశేఖర్‌రెడ్డి, సర్పంచ్ శివప్పనాయుడు, నాయకులు చంద్ర, రామాంజులరెడ్డి, పవన్, అక్రమ్, లక్ష్మీనరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెనుకొండలో గాలివాన బీభత్సం

- పలు కాలనీల్లో కూలిన చెట్లు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

**పెనుకొండ రూరల్, మే 8:** నియోజకవర్గ కేంద్ర మైన పెనుకొండలో మంగళవారం రాత్రి ఈదురుగాలులతో కూడి భారీ వర్షం కురిసింది. గాలివానకు సబ్‌కలెక్టర్ కార్యాలయం ప్రహరీ ధ్వంసమైంది. దీంతో రూ.2లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. అలాగే కార్యాలయం ఆవరణలో మూడుచెట్లు నేల కూలాయి. పెనుకొండ-మడకశిర రహదారిలోని జర్నలిస్ట్ కాలనీలో రహదారి పక్కన ఏర్పాటుచేసిన రేకుల బంకు గాలివానకు 50మీటర్ల దూరంలో ఎగిరిపడింది. రైల్వే స్టేషన్ కాలనీలో గాలివానకు చెట్టుకూలి విద్యుత్‌స్తంభంపై పడటంతో ఆ స్తంభం పూర్తిగా నేలకొరిగి ఆ ప్రాంతంలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అయితే ఎవరికి ఎలాంటి ప్రాణాపాయం కలుగకపోవడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. గాలివానకు ప్రభుత్వ ఆసుపత్రిలో చెట్టుకూలి విద్యుత్‌స్తంభం నేలకొరిగింది. దీంతో మంగళవారం రాత్రి నుంచి పెనుకొండ ప్రభుత్వాసుపత్రి, రైల్వే క్వార్టర్స్ తదితర పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అధికారులు బుధవారం మధ్యాహ్నం వరకు స్తంభాలపై పడిన చెట్లు తొలగించి మరమ్మతులు చేపట్టారు.

## నేడు హజ్‌యాత్రికులకు టీకాలు

**పుట్టపర్తి రూరల్, మే 8:** హజ్ యాత్ర చేసే వారికి హిందూపురం జిల్లా ప్రభుత్వాసుపత్రి ఆవరణంలో గురువారం టీకాలు వేయనున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ మంజువాణి బుదవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని హజ్ యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందుకు సంబంధించి జిల్లాలోని 179 మంది యాత్రికులకు ఇన్‌ఫ్లూఎంజా, మేనిగోకొకల్, ఓరల్ పోలియో వ్యాక్సీనేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇందుకు సంబంధించి హజ్ యాత్రికులు ఆసుపత్రికి వెళ్లేటప్పుడు హెల్త్ కార్డు తమ వెంట తీసుకెళ్లాలన్నారు. టీకా వ్యాక్సినేషన్ ఉదయం 9గంటల నుంచి ప్రారంభం అవుతుందిన జిల్లా వైద్యాధికారి తెలిపారు.

## నేటి నుంచి సత్యకుమార్‌కు మద్దతుగా పాదయాత్ర


మాట్లాడుతున్న చిలకం మధు

**ధర్మవరం, మే8:** పట్టణంలో గురువారం నుంచి కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్‌కు మద్దతుగా పాదయాత్ర నిర్వహించనున్నట్లు జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి తెలిపారు. స్థానిక తన నివాసంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సత్యకుమార్‌కు మద్దతుగా గురువారం 11వ తేదీ వరకు పట్టణంలోని 40 వార్డుల్లో పాదయాత్ర చేపడతానన్నారు. గురువారం ఉదయం 7:30గంటలకు శివానగర్ శివాలయంలో ప్రత్యేక పూజలు చేయించి పాదయాత్ర ప్రారంభిస్తానన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సత్యకుమార్‌ను గెలిపించాలంటూ ఓటర్లను అభ్యర్థిస్తామన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొనాలని కోరారు.

## 11న సాయంత్రం ఎన్నికల ప్రచారం ముగించాలి : ఆర్‌ఓ

**పెనుకొండ టౌన్, మే 8:** సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఈ నెల 13న జరుగనుందని, దీంతో ఈ నెల 11 వ తేదీ సాయంత్రం 5గంటలలోగా ఎన్నికల ప్రచారం ముగించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అపూర్వభరత్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలు 2024 దృష్ట్యా ఈనెల 13న ఓటింగ్ జరుగనుందని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని పోలింగ్‌కు 48 గంటల్లోపే నిలిపివేయాలన్నారు. లేనిపక్షంలో ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామనా ఆర్‌ఓ తెలిపారు.

## గోరంట్లలో 14న సంత: ఈఓ

**గోరంట్ల, మే 8:** మండలకేంద్రమైన గోరంట్లలో ప్రతి సోమవారం నిర్వహించే కాయకూరల వారపు సంత ఈ నెల 13న జరుగదని, ను ఈ 14వ తేదీ మంగళవారం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యనిర్వాహణాధికారి బాబురావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల13న సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరుగనుండడంతో సంత తేదీని మార్పు చేసినట్లు చెప్పారు. ఈ సంతకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటకనుంచి పెద్దఎత్తున వ్యాపారలు, రైతులు తమ ఉత్పత్తులను విక్రయించడానికి తరలి వస్తుంటారు. వారికి అసౌకర్యం కలుగకుండా ఉండడానికి ముందుగానే ప్రకటించినట్లు తెలిపారు. ఈవిషయాన్ని దండోరా ద్వారా ప్రజలకు తెలియజేస్తామని ఆయన తెలిపారు.

## నేడు మడకశిరలో నారా రోహిత్ పర్యటన

**మడకశిర టౌన్, మే 8:** సినీ హీరో నారా రోహిత్ గురువారం మడకశిర నియోజకవర్గంలో పర్యటంచనున్నట్లు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు, నియోజకవర్గం సమన్వయకర్త గుండుమల తిప్పేస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు రొళ్ల మండల కేంద్రంలో రోడ్‌షో నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు గుడిబండ మండల కేంద్రంలోని మార్కెట్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతారని, 3గంటలకు మడకశిర పట్టణంలోని యాదవ కల్యాణ మండపంలో యువతతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటాని తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

## నేడు గోరంట్లలో టీడీపీ రోడ్‌షో

**గోరంట్ల, మే 8:** మండలకేంద్రమైన గోరంట్లలో గురువారం టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో రోడ్‌షో నిర్వహించనున్నట్లు టీడీపీ మండల, పట్టణ కన్వీనర్లు సోముశేఖర్, కక్కల రఘునాథ్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రోడ్ షోలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, మాజీ ఎంపీ నిమ్మలక్రిష్టప్ప, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జేఎం శేఖర్ పాల్గొంటారన్నారు. ఉదయం 9గంటలకు కదిరి రోడ్డులోని విజయకుమార్ పెట్రోల్ బంక్ వద్ద నుంచి ప్రధాన రహదారిపై గుమ్మయ్యగారిపల్లి కూడలి వరకు రోడ్‌షో సాగుతుందని వారు తెలిపారు.

### పెనుకొండలో ఎన్నికల ప్రచారం...

**పెనుకొండ టౌన్ :** టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి గురువారం పెనుకొండలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ సిద్దయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని కుమ్మరదొడ్డి, బ్రాహ్మణవీధి, గగన్మహల్ స్ట్రీట్, తోటగేరి తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారన్నారు. ఉదయం స్థానిక ఆంధ్ర బ్యాంక్ వద్దకు చేరుకోవాలని కార్యకర్తలకు సూచించారు.

## నేడు హజ్ యాత్రికులకు టీకాలు

**పుట్టపర్తి రూరల్, మే 8:** హజ్ యాత్ర చేసే వారికి హిందూపురం జిల్లా ప్రభుత్వాసుపత్రి అవరణంలో గురువారం టీకాలు వేయనున్నట్లు జిల్లావైద్యాధికారి డాక్టర్ మంజువాణి బుధవారం ఓప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని హజ్ యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని కోరా రు. ఇందుకు సంబంధించి జిల్లాలోని 179 మంది యాత్రికులకు ఇన్‌ఫ్లూఎంజా, మేనిగోకొకల్, ఓరల్ పోలియో వ్యాక్సినేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇందుకు సంబంధించి హజ్ యాత్రికులు ఆసుపత్రికి వెళ్లేటప్పుడు హెల్త్ కార్డు తమ వెంట తీసుకెళ్లాలన్నారు. టీకా వ్యాక్సినేషన్ ఉదయం 9గంటల నుంచి ప్రారంభం అవుతుందిన జిల్లా వైద్యాధికారి తెలిపారు.

## ఘనంగా రెడ్‌క్రాస్ డే

**గోరంట్ల, మే 8:** ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని గోరంట్ల ప్రభుత్వాసుపత్రి వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీ రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవస్థాపకుడు జాన్‌హెంన్రీ డూనాంటూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. రోగులకు వేసవి ఉపసమనం కోసం ఏర్పాటు చేసిన టెంట్‌ను వైద్యులు ప్రారంభించారు. అనంతరం రోగులకు చల్లటి మజ్జిగ పంపిణీ చేశారు. వైద్యులు వినోద్‌కుమార్, ఉష, వేణుగోపాల్, రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు సురేష్, దేవాంగం జగదీష్, కోఆర్డినేటర్ రమేష్, డాక్టర్ రాజు, సాయిదర్శిని , అమరనాథ్, ఆదినారాయణమ్మ, చంద్రశేఖర్, సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

## షెడ్డుపై నుంచి పడి జీవిత ఖైదీ మృతి



రంగయ్య (ఫైల్)

**కడప (క్రైం), మే 8 :** కడప కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్న ఉప్పర రంగయ్య ఆలియాస్ పూజారి (48) (సీటీ నెం.7925) బుధవారం ఉదయం డెయిరీ షెడ్డుపై కూలిన చెట్టుకొమ్మలు తొలగించే క్రమంలో ప్రమాదవశాత్తు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. రిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రిమ్స్ ఏఎస్‌ఐ యోగేంద్ర వివరాల మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా ఆగళి మండలం హనుమాన్‌పల్లెకు చెందిన ఉప్పర రంగయ్య ఆలియాస్ పూజారి 2019 ఫిబ్రవరి 2 నుంచి హత్య కేసులో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్నాడు. ఇతని ప్రవర్తన బట్టి సెమీ ఓపెన్ ఎయిర్ జైలు ఖైదీ బృందంలో ఉన్నాడు.. మిగతా ఖైదీలతో కలిసి పాల డెయిరీ, గార్డెనింగ్ పనులకు వెళ్లేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు కేంద్ర కారాగార ఆవరణంలోని డెయిరీ షెడ్డుపై పెద్దచెట్టు కొమ్మలు విరిగి పడ్డాయి. ఈ కొమ్మలు తొలగించేందుకు బుధవారం రంగయ్య చెట్టుపైకి ఎక్కాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి రేకు మీద మోపడంతో రేకు విరిగి అతను కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.. జైలు సూపరింటెండెంట్ ఐఎన్‌హెచ్ ప్రకాశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

# పురానికి మరిన్ని పరిశ్రమలు తీసుకొస్తా

ఎన్నికల ప్రచారంలో నందమూరి బాలకృష్ణ



దివ్యాంగురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న బాలకృష్ణ



ప్రజలకు విజయ సంకేతం చూపుతున్న బాలయ్య

**హిందూపురం, మే 8 :** నియోజకవర్గానికి మరిన్ని పరిశ్రమలు తీసుకొస్తామని టీడీపీ అభ్యర్థి నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆయన బుధవారం గొల్లాపురం, తూముకుంట, సంతేబిదునూరు, కొటిపి పంచాయతీ పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ... ఎన్టీఆర్ హయాంలో తూముకుంట పారిశ్రామికవాడకు పరిశ్రమలు తెచ్చామన్నారు. దీనివల్ల హిందూపురం మండలంలో భూముల విలువ అమాంతంగా పెరిగి రైతులకు మేలు జరిగిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమలు తెస్తామన్నారు. హంద్రీనీవా కాలువ ద్వారా మండలంలోని అన్ని చెరువులకు నీరందిస్తామన్నారు. గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు నంది స్తామన్నారు. బెంగళూరు ప్రధాన రహదారిని మరింత విస్తరిస్తామని మరిన్ని గార్మెంట్ పరిశ్రమలు తీసుకొస్తానన్నారు. ఈ కార్యక్రమం లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### వ్యాపారులకు టీడీపీ అండ : వసుంధరా దేవి

నియోజకవర్గంలో ఉన్న ఆర్యవైశ్యుల ఆస్తులకు, వ్యాపారాలకు టీడీపీ అండగా ఉంటుందని నందమూరి వసుంధరాదేవి అన్నారు. స్థానిక వాసవీ ధర్మశాలలో బుధవారం రాత్రి ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వసుంధరాదేవి మాట్లాడుతూ ఆర్యవైశ్యులు టీడీపీ ఆవిర్భావం నుంచి వెన్నంటి ఉన్నారన్నారు. హిందూపురం ఎప్పుడూ ప్రశాంతంగా ఉండాలన్నదే నందమూరి బాలకృష్ణ ధ్యేయమన్నారు. మూడోసారి బరిలో ఉన్న బాలకృష్ణకు, ఎంపీ అభ్యర్థి పార్థసారథికి ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ రావిళ్ల లక్ష్మి, ఐటీ వింగ్ ప్రతినిధి తేజస్విని, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు జేపీకే రాము, కౌన్సిలర్ రాఘవేంద్ర, ఆదర్శ్‌కుమార్, కళావతి, రూపాదేవి, గీత తదితరులు పాల్గొన్నారు.

**లేపాక్షి :** మండలంలోని బయన్నపల్లి, బసవనపల్లి, మామిడిమాకులపల్లి, మద్దిపి గ్రామాల్లో బుధవారం నందమూరి వసుంధరాదేవి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలకు అభివాదం చేస్తూ టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు.



లేపాక్షిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వసుంధరాదేవి

# ఇసుక దొంగలు వస్తున్నారు జాగ్రత్త..!

- ఎన్నికల ప్రచారంలో సవిత
- గ్రామాల్లో ఘనస్వాగతం



సవిత, బీకేకు హారతులు పడుతున్న మహిళలు



రొద్దం రోడ్‌షోలో ప్రసంగిస్తున్న సవిత

**రొద్దం, మే 8 :** పెనుకొండ నియోజకవర్గ ప్రజలారా ఇసుక దొంగలు వస్తున్నారు... తస్మాత్ జాగ్రత్త... అని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత హెచ్చరించారు. ఆమె బుధవారం మండల పరిధిలోని వైటీరెడ్డిపల్లి, రంగాపురం, దొడగట్ట, డీఆర్ కొట్టాల, రెడ్డిపల్లి, గోనిమేకలపల్లి, పెద్దగువ్వలపల్లి, ఆర్ కొట్టాల ఆర్ మరువపల్లి, రొద్దం, తిమ్మాపురం, బూదిపల్లి, శేషాపురం, కలిపి, కె మరువపల్లిల్లో బీకే పార్థసారథితో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ... కళ్యాణదుర్గం నుంచి వలస పక్షి ఉశశ్రీ వచ్చిందని, అక్కడి ఇసుకంతా బెంగళూరుకు తరలించి సొమ్ము చేసుకుందని విమర్శించారు. ఇపటికే రొద్దం, పరిగి మండలాల్లో ఇసుక మాయం అయిపోతోందని కాస్త జాగ్రత్తపడి వచ్చే ఎన్నికల్లో తనకు, బీకేకు ఓటు వేయాలన్నారు. తాము పక్కా లోకల్ అని, వలసదారులు ఎంతోమంది వస్తుంటారు, దోచుకుని వెళ్తుంటారని విమర్శించారు. తన తండ్రి రాచంద్రారెడ్డి కాలం నుంచి బీకే పార్థసారథి వరకు చేసిన అభివృద్ధి కార్యక్రమాలే నియోజకవర్గంలో కనబడుతున్నాయన్నారు. వైసీపీ వారు అక్రమంగా సంపాదించిన డబ్బును పంపిణీ చేసేందుకు వస్తారని... తనకు, బీకేకు డబ్బులు లేవని కేవలం ప్రజాబలమే ఉందన్నారు. అభివృద్ధి అంటే టీడీపీ, టీడీపీ అంటే అభివృద్ధి అన్నారు. ఈ ఐదేళ్లకాలంలో వైసీపీ ప్రభుత్వం టీడీపీ కార్యకర్తలపై, నాయకులపై అక్రమ కేసులు బనాయించిందని మండిపడ్డారు. వైసీపీ వారికి హిందూపురం పార్లమెంట్ పరిధిలో దమ్మున్న నాయకులు ఎవరు లేరా అని ప్రశ్నించారు. పెనుకొండకు కియ, నాసెన్, బెల్ పరిశ్రమల ఏర్పాటు, గొల్లపల్లి రిజర్వాయర్ లాంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు తెచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. సంపద సృష్టించడం, అభివృద్ధి ఫలాలను ప్రజలకు పంచిపెట్టడం చంద్రబాబుకే చెల్లన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జీవీపీ నాయుడు, మాధవనాయుడు, సుబ్బరత్నమ్మ, నరసింహులు, రామకృష్టప్ప, నరహరి, కురుబ కృష్ణమూర్తి, నరసింహులు, చిన్నప్పయ్య, ఆర్. కొట్టాల శ్రీనాథ్‌చౌదరి, తిరుపాల్‌నాయుడు, దొడగట్ట రామచంద్ర, శేషాపురం అరుణ్‌రెడ్డి, వీరాంజనేయులు, వాల్మీకిచంద్రశేఖర్, టైలర్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

### ఉశశ్రీ.. దిగజారుడు రాజకీయాలు మానుకో...

**పెనుకొండ టౌన్:** వలస పక్షిలాగా వచ్చిన నాయకురాలు హుందాగా వ్యవహరించాలని, కళ్యాణదుర్గంలో చేసిన దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. ఆమె బుధవారం ఎన్నికల ప్రచారం అనంతరం రొద్దంలో మాట్లాడారు. పోస్టల్ బ్యాలెట్‌లో అధికార పార్టీకి కనుచూపు మేరలో ఓటింగ్ కనిపించలేదన్న అక్కసుతో పోలీసుల సమక్షంలోనే వైసీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. నరుకుతాం అనడం దేనికి సంకేతమన్నారు. ప్రశాంతంగా ఉన్న పెనుకొండ ఇప్పుడిప్పుడే పర్యాటకంగా అభివృద్ధి చెందుతోందని, పలు పరిశ్రమలు వస్తున్నాయన్నారు. ఇలాంటి తరుణంలో ఉషశ్రీ అనుచరులు ఇలా వివాదాస్పదంగా మాట్లాడటం పెనుకొండ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం కాదా అని ప్రశ్నించారు అంతటితో వదలకుండా చురుగ్గా పనిచేస్తున్న పట్టణంలోని ఓ కాలనీకి చెందిన తమ అనుచరులను బెదిరించడం మానుకోవాలన్నారు. రాజకీయాన్ని రాజకీయంలాగే చూడాలన్నారు. కార్యక్రమంలో తెలుదు మహిళ జిల్లా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నాయకులు జీవీపీ నాయుడు, టీడీపీ నేత అరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అరుణ్‌రెడ్డి ఆమెను గజమాలతో సత్కరించారు.



సవితను గజమాలతో సత్కరించి చిత్రపటం బహూకరిస్తున్న అరుణ్‌రెడ్డి

# పెనుకొండలో గాలివాన బీభత్సం

పలు కాలనీల్లో పడిపోయిన చెట్లు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



గాలివానకు నేలకూలిన సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రహరీ

**పెనుకొండ రూరల్, మే 8 :** నియోజకవర్గ కేంద్రమైన పెనుకొండలో మంగళవారం రాత్రి ఈదురుగాలులతో కూడి భారీ వర్షం కురిసింది. గాలివానకు సబ్‌కలెక్టర్ కార్యాలయం ప్రహరీ ధ్వంసం అయింది. దీంతో రూ.2లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. అలాగే కార్యాలయం ఆవరణలో మూడుచెట్లు నేలకూలాయి. పెనుకొండ - మడకశిర రహదారిలోని జర్నలిస్ట్ కాలనీలో రహదారి పక్కన ఏర్పాటుచేసిన రేకుల బంకు గాలివానకు 50మీటర్ల దూరంలో ఎగిరిపడింది. రైల్వే స్టేషన్ కాలనీలో గాలివానకు చెట్టుకూలి విద్యుత్‌స్తంభంపై పడటంతో ఆ స్తంభం పూర్తిగా నేలకొరిగి ఆ ప్రాంతంలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అయితే ఎవరికి ఎలాంటి ప్రాణాపాయం కలుగకపో వడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. గాలివానకు ప్రభుత్వ ఆసుపత్రిలో చెట్టుకూలి విద్యుత్‌స్తంభం నేలకొరిగింది. దీంతో మంగళవారం రాత్రి నుంచి పెనుకొండ ప్రభుత్వాసుపత్రి, రైల్వే క్వార్టర్స్ తదితర పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అధికారులు బుధవారం మధ్యాహ్నం వరకు స్తంభాలపై పడిన చెట్లు తొలగించి మరమ్మతులు చేపట్టారు.



రైల్వే క్వార్టర్స్‌లో చెట్టుపడి నేలకొరిగిన విద్యుత్ స్తంభం



ప్రభుత్వాసుపత్రిలో పడిపోయిన చెట్టు



మడకశిర రహదారిలో రోడ్డుపైకి ఎగిరిపడ్డ బంకు

## చికిత్స పొందుతూ కూలీ మృతి

**గోరంట్ల, మే 8:** మండలంలోని గుంతపల్లికి చెందిన రంగనాథ్(40) అనే కూలీ మార్చి 26న చింతచెట్టుపె నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడు బెంగుళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. గుంతపల్లికి చెందిన నరసింహప్ప కుమారుడు రంగనాథ్ అదే గ్రామంలో చింతకాయలు దులపడానికి కూలిగా వెళ్లాడు. చింతచెట్టు ఎక్కి కాయలు దులుపుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడ్డాడు. దీంతో తీవ్రంగా గాయాలైన రంగనాథ్‌కు పుట్టపర్తి, అనంతపురం, కర్నూలు ఆసుపత్రులలో చికిత్సలు అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగుళూరులోని ఎంఎస్‌రామయ్య ఆసుపత్రికి తర లించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు. పోలీసులు కేసు నమోదుచేసి, మృతదేహానికి బెంగుళూరులో శవాన్నికి పోస్టమార్టం నిర్వహించిట్లు చెప్పారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నట్లు తెలిపారు.

# యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన

- వార్డుల్లో, పల్లెల్లో సిద్ధం స్టిక్కర్ల అతికింపు
- చోద్యంచూస్తున్న ఫ్లయింగ్‌స్క్వాడ్
- పట్టించుకోని ఎన్నికల అధికారులు



ఇంటికి అతికించిన సిద్ధం స్టిక్కర్లు, క్యాలెండర్



హస్నాబాద్‌లో స్టిక్కర్లు పంపిణీ చేస్తున్న వలంటీరు

**పెనుకొండ రూరల్:** మండలంలో ఎన్నికల నిబంధనలు అమలు కావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా పెనుకొండ నగర పంచాయతీ మంగాపురంలో బలవంతంగా వైసీపీ నాయకులు ఇళ్లకు జగన్ స్టిక్కర్లు అతికించారు. వాటిని బుధవారం టీడీపీ నాయకులు తొలగించారు. పెనుకొండ మండలంలో ఎన్నికల నిబంధనలు వైసీపీ నాయకులు పాటించడం లేదని టీడీపీ నాయకులు విమర్శించారు.

**హిందూపురం, మే 8:** ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ఎక్కడైనా ఏ చిన్న ఘటన జరిగినా కోడ్ అమలులో ఉందని అధికారులు చెబుతారు. కానీ వైసీపీ నాయకులు యథేచ్ఛగా ఇళ్ల వద్దకు వెళ్లి సిద్ధం స్టిక్కర్లు అతికిస్తున్నా పట్టించుకున్న పాపనపోలేదు. హిందూపురం పట్టణ పరిధిలోని 30, 31 వార్డుల్లో కొంతమంది వార్డు వలంటీర్లు సిద్ధం స్టిక్కర్లు, వాల్ పోస్టర్లు తీసుకెళ్లి ఇళ్లకు అతికిస్తున్నారు. ఈ క్యాలెండర్‌లో కలలు నిజం చేయడానికి జగన్ కోసం సిద్ధం అంటూ ఉంది. అలాగే ఈ ఎన్నికలు కేవలం ఎమ్మెల్యే ఎంపీలను ఎన్నుకోవడం కాదు మీ పిల్లల భవిష్యత్తును నిర్ణయించేందుకే ఫ్యాన్ గుర్తుకు ఓటే యాలని చెబుతూ స్టిక్కర్లను అతికిస్తూ వెళ్తున్నారు. కొన్నిచోట్ల ఇళ్లలోకి వెళ్లి స్టిక్కర్, క్యాలెండర్ ఇచ్చి వెళుతున్నారు. అదేవిధంగా చిలమత్తూరులో అధికార పార్టీ ఎంపీపీ పురుషోత్తంరెడ్డి ఇంటింటికి వెళ్లి సిద్ధం స్టిక్కర్లు అతికించారు. చర్యలు తీసుకోవాల్సిన ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ చోద్యం చూస్తున్నారు కానీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. వీటిని పట్టించుకోవాల్సిన అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో వైసీపీ నాయకులు సిద్ధం స్టిక్కర్లు యథేచ్ఛగా అతికిస్తూ వెళుతున్నారు. దీనిపై చిలమత్తూరు ఎంపీడీఓ, పురం మునిసిపల్ కమిషనర్‌కు టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు శివశంకర్ ఫిర్యాదు చేశారు.



పెనుకొండలో ఇళ్లకు అతికించిన సిద్ధం స్టిక్కర్‌ను తొలగిస్తున్న టీడీపీ నాయకుడు

## బాబు వస్తేనే రాష్ట్రం అభివృద్ధి

ఎన్నికల ప్రచారంలో టీడీపీ నాయకులు

**చిలమత్తూరు, మే 8:** చంద్రబాబునాయుడు మరోసారి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం పురోగాభివృద్ధి సాధిస్తుందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. నాయకులు నాగరాజుయాదవ్, లక్ష్మీనారాయణయాదవ్, నందీశప్ప, అశ్వత్థప్ప, గౌరీశంకర్, విశ్వనాథరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, గంగప్ప తదితరులు బుధవారం మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచారం ర్యాలీ నిర్వహించారు. బాబు వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందని, అందుకోసం త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయాలని కోరారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రకాలుగా వెనుకబడిపోయిందని, మరో సారి అదే ప్రభుత్వం అధికారంలోకి వస్తే మరో 20 ఏళ్లు రాష్ట్రం పూర్తిగా వెనకు వెళుతుందన్నారు. హిందూపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా బాలకృష్ణను, ఎంపీగా పార్థసారథిని గెలిపించాలని కోరారు.

### టీడీపీతోనే ప్రజాసంక్షేమం

**చిలమత్తూరు:** రాష్ట్రంలో సంక్షేమం అమలుకావాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని శెట్టిపల్లి పంచాయతీలో బుధవారం మండల కన్వీనర్ రంగారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా ఎన్ని కల ప్రచారం నిర్వహించిరు. ఇంటింటికి వెళ్లి టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోను, సూపర్ సిక్స్ పథకాలను ఓటర్లకు వివరించారు. హిందూపురం నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే మరోసారి ఎమ్మెల్యేగా బాలకృష్ణను, ఎంపీగా పార్థసారథికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేమకేతేపల్లి అంజినప్ప, సోమశేఖర్, చంద్రశేఖర్, బేకరీ గంగాధర్, రజనీకాంత్, నారాయణప్ప, ప్రవీణ్‌కుమార్ తదితరలు పాల్గొన్నారు.

### టీడీపీ గెలిస్తే గ్రామాల అభివృద్ధి

**పెనుకొండ రూరల్, మే 8 :** వైసీపీ ఐదేళ్లపాలనలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని, టీడీపీగెలిస్తే గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తాయని ఆ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ చంద్రకాంతమ్మ మిలిటరీ నారాయణప్ప, పేర్కొన్నారు. వారు బుధవారం మండలంలోని మంగాపురంలో ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, ఎంపీ అభ్యర్థి బీకే తరుపున గ్రామంలో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ నారాయణస్వామి, నారాయణనాయక్, మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, సుబ్రహ్మణ్యం, బోయశంకర్, కొల్లప్ప, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

### చంద్రబాబును సీఎం చేద్దాం

**అగళి :** టీడీపీ అధినేత చంద్రబాబను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని వాల్మీకుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ పిలుపునిచ్చారు. ఆయన ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని కోడిపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కుమారస్వామి, జడ్పీటీసీ ఉమేష్, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ శికుమార్ పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## టీడీపీతోనే బీసీల అభివృద్ధి: ఎంఎస్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్ రాజు

**మడకశిర టౌన్, మే 8:** రాజకీయంగా, ఆర్థికంగా వెనకబడిన వర్గాల అభివృద్ధికి బాటలు వేసిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు పేర్కొన్నారు. మడకశిర పట్టణంలోని యాదవ కల్యాణ మండపంలో బుధవారం కుంచిటిగ వక్కలిగుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలోని బాలాజీనగర్‌లో ఉన్న టీడీపీ కార్యాలయం అవరణంలో మాల, కురుబ, వడ్డెర, శెట్టిబలిజ కులస్తుల ఆత్మీయ సమావేశాలను వరుసగా నిర్వహించారు. ఈ సమావేశాల్లో టీడీపీ నియోజకవర్గం సమన్వయ కర్త గుండుమల తిప్పేస్వామితో కలసి ఎంఎస్ రాజు పాల్గొని మాట్లాడారు. వచ్చేది వెనకబడిన వర్గాల అభివృద్ధిని కాంక్షిం చే టీడీపీ ప్రభుత్వమే అని, అందరికి న్యాయం జరుగు తుందన్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీకి తగిన గుణ పాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, శెట్టి బలిజ సంఘం నాయకులు రాయల్‌మురళి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస మూర్తి, నాయకులు వీఎం పాండురంగప్ప, లక్ష్మీనారాయణ, గణేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాధమ్మ, రాజు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామాల్లో అభివృద్ధి శూన్యం : టీడీపీ



అభివృద్ధి అంటే ఇదేనా అనిచూపుతున్న టీడీపీ నాయకులు

**పెనుకొండ రూరల్, మే 8 :** వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామాల్లో అభివృద్ధి శూన్యమని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రఘువీర చౌదరి, మండల మాజీ కన్వీనర్ శ్రీరాములుయాదవ్ విమర్శిం చారు. టీడీపీ నాయకులు బుధవారం మండలంలోని వెంకటగిరి పాళ్యంలోని పలు కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీసీ కాలనీలో సీసీ రోడ్లులేక పోవడం, రోడ్డుపైకి వస్తున్న మురు గునీటిని చూసి వైసీపీ చేసిన అభివృద్ధి ఇదేనా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకు లు పాలడుగు చంద్ర, కోనాపురం రామలింగ, మాజీ ఎంపీటీసీ సూర్య నా రాయణ, బాబుల్ రెడ్డి, మారుతి, బయప్పరెడ్డి, వడ్డివెంకటేశ్ తది తరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో టీడీపీ నాయకుడి మృతి

**యల్లనూరు, మే 8:** మండలంలోని గడ్డంవారిపల్లిలో టీడీపీ నాయకుడు గోపాల్ రెడ్డి (54) విద్యుత్ షాక్‌కు గురై బుధవారం ఉదయం మృతిచెందాడు. వివరాల ప్రకారం గోపాల్‌రెడ్డి ఉదయం మోటారు ద్వారా నీటిని వదలడానికి పొలం వద్దకు భార్యతో కలిసి వెళ్లాడు. భార్యకు మోటార్ ఆన్‌చేసి వస్తానని చెప్పి బోరువద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు అక్కడ విద్యుత్‌వైర్లు మీదపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎంతసేపటికి భర్త రాకపోవడంతో గంగాదేవి మోటారు వద్దకు వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. గోపాల్‌రెడ్డికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.